Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU





అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 314 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

శుక్రవారం, 31 - 7 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

# ఉత్తరాంధ్రకు మకుటాయమానం.. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం : మంత్రి కందుల దుర్గేష్

**- ఆగస్టు 1న ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం' ప్రారంభోత్సవం.. ఈ సందర్భంగా ఏర్పాట్లను సమీక్షించి, ఎయిర్‌పోర్టును పరిశీలించిన మంత్రి కందుల దుర్గేష్ - ఆంధ్రుల సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా రూపుదిద్దుకున్న టెర్మినల్ భవనంపై ప్రశంసల వర్షం..సంస్కృతి, ఆధునికతల సంగమం.. గ్లోబల్ ఇమేజ్‌కి చిరునామా భోగాపురం ఎయిర్‌పోర్ట్ అని అభివర్ణన - భోగాపురం ఎయిర్‌పోర్టుతో ఉత్తరాంధ్రలో పారిశ్రామిక, పర్యాటక విప్లవం..ఉత్తరాంధ్ర ప్రగతికి 'భోగాపురం ఎయిర్ పోర్ట్' గ్రోత్ ఇంజిన్ : మంత్రి కందుల దుర్గేష్ - ఎయిర్ పోర్ట్ ప్రారంభోత్సవ చారిత్రాత్మక ఘట్టంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని మంత్రి కందుల దుర్గేష్ పిలుపు**







**భోగాపురం, (రాజధాని వార్తలు):** ఉత్తరాంధ్ర ముఖచిత్రాన్ని మార్చే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఈ ప్రాంత రాజకీయ, ఆర్థిక, పర్యాటక వృద్ధికి ప్రధాన చిరునామాగా మారనుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. ఆగస్టు 1న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా జరగనున్న "అల్లూరి సీతారామ రాజు అంతర్జాతీయ విమానాశ్రయం" ప్రారంభోత్సవ ఏర్పాట్లను బుధవారం ఆయన సహచర మంత్రులతో, ఉన్నతాధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్ట్ లోపల ఏర్పాటు చేసిన సాంస్కృతిక కట్టడాలు, కళాకృతులను మంత్రి దుర్గేష్ ఆసక్తిగా తిలకించగా సంబంధిత వివరాలను సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుళ్ల మల్లిఖార్జున రావు వివరించారు. అనంతరం టెర్మినల్ భవనంలో ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవం ప్రస్ఫుటించేలా చేసిన ఏర్పాట్లను మంత్రి దుర్గేష్ కొనియాడారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. అభివృద్ధికి రెక్కలు వచ్చినట్లుగా, ఉత్తరాంధ్రకు గ్లోబల్ లుక్ వచ్చేలా దర్శనమిస్తున్న ఈ ఎయిర్‌పోర్ట్ ఆవరణలో ఏర్పాటు చేసిన బొబ్బిలి వీణలు, కూచిపూడి నృత్య భంగిమలు, ఏటికొప్పాక బొమ్మలు, తోలుబొమ్మలాట చిత్రాలు, కలంకారీ పెయింటింగ్స్ ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవానికి అద్దం పట్టేలా ఉంటూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని పేర్కొన్నారు. ప్రత్యేకించి శ్రీశైలం, తిరుమల, లేపాక్షి నంది వంటి ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, మన్యం అందాలను చాటిచెప్పే డిజిటల్ స్క్రీన్‌లు, వాల్ పెయింటింగ్స్‌తో ఆంధ్రా వైభవం ప్రతి ఒక్కరినీ ఆకట్టుకునేలా ఉందని అభినందించారు. 'ఫ్లైయింగ్ ఫిష్' ఆకారంలో రూపొందించిన టెర్మినల్ డిజైన్, విద్యుద్దీపాలంకరణతో అత్యంత సుందరంగా ఉందన్నారు. అంతేగాక ఎయిర్‌పోర్టులోని ఏరో బ్రిడ్జ్, ఏరో ట్రాఫిక్ కంట్రోల్ టవర్, రన్‌వే, టాక్సీవేలు, ఏప్రాన్ ప్రాంతాలు, అప్రోచ్ రోడ్లను మంత్రి దుర్గేష్ నిశితంగా పరిశీలించారు. హైస్పీడ్ సెక్యూరిటీ స్కానింగ్, ఫాస్ట్ డిజిటల్ చెక్-ఇన్, సెల్ఫ్ బ్యాగేజ్ డ్రాప్ ఇ-గేట్స్, విశాలమైన పార్కింగ్ స్థలాలు, ఎస్క లేటర్లు, ఎలివేటర్లు వంటి ఆధునిక వసతులు ప్రయాణికులకు అంతర్జాతీయ స్థాయి అనుభూతిని అందిస్తాయని తెలిపారు. ఎయిర్‌పోర్ట్ నమూనాను పరిశీలించి అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విశాఖ రైల్వే జోన్‌తో పాటు భోగాపురం ఎయిర్ పోర్టు ద్వారా కేంద్ర సహకారంతో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ల నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఉత్తరాంధ్ర అభివృద్ధికి పెద్దపీట వేసిందని మంత్రి తెలిపారు. ఈ విమానాశ్రయం వల్ల ఈ ప్రాంతానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు, పెట్టుబడులు తరలివస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పర్యాటకం, విమానయాన, పారిశ్రామిక రంగాలలో విపరీతమైన అవకాశాలు పెరుగుతాయని స్పష్టం చేశారు. ఉత్తరాంధ్ర భవిష్యత్తును మార్చే గేమ్ చేంజర్ ఈ ఎయిర్ పోర్ట్ అని చెబుతూ.. విశాఖ ఎకనామిక్ రీజియన్‌లో ఇది కీలక భూమిక పోషిస్తూ, ఆంధ్రప్రదేశ్‌కు గ్లోబల్ ఇమేజ్ తీసుకొస్తుందని మంత్రి దుర్గేష్ ధీమా వ్యక్తం చేశారు. ఈ చారిత్రాత్మక ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఎలాంటి లోటుపాట్లు లేకుండా పక్కాగా నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారని.. అందుకు అనుగుణంగానే ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయని తెలిపారు.

ప్రధాని పర్యటన సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న 'థింసా' నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని వెల్లడించారు. ఆగస్టు 1న జరగనున్న ఈ చారిత్రాత్మక ఘట్టంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు.

# "అక్రమ రవాణా ముఠాల లక్ష్యం ఇప్పుడు మన బాలల కలలు... ప్రతి కుటుంబం అప్రమత్తంగా ఉండాలి"

## - ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ వేటుకూరి ఎ.వి.ఎస్. సూర్యనారాయణ రాజు

**విజయవాడ, (రాజధాని వార్తలు):** "మానవ అక్రమ రవాణా అనేది ఇక సరిహద్దులు దాటి జరిగే నేరం మాత్రమే కాదు... మన ఇళ్లలోని మొబైల్ ఫోన్లలోకి, సోషల్ మీడియా ఖాతాల్లోకి, ఉద్యోగ ప్రకటనల రూపంలోకి చొరబడిన అత్యంత ప్రమాదకరమైన సంఘటిత నేరం. మన పిల్లల కలలు, యువత భవిష్యత్తు, కుటుంబాల విశ్వాసాన్ని లక్ష్యంగా చేసుకున్న ఈ ముఠాలను ఎదుర్కోవాలంటే ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. ఒక చిన్నారిని లేదా యువకుడిని అక్రమ రవాణా నుంచి రక్షించడం అంటే ఒక జీవితాన్ని, ఒక కుటుంబాన్ని, ఒక భవిష్యత్తును కాపాడినట్టే" అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ వేటుకూరి ఏ.వి.ఎస్. సూర్యనారాయణ రాజు పేర్కొన్నారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మరియు హెల్ప్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కమిషన్ చైర్‌పర్సన్ వేటుకూరి ఎ.వి.ఎస్.సూర్యనారాయణ రాజు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా హెల్ప్ సంస్థ, మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సంయుక్తంగా మానవ అక్రమ రవాణాపై రూపొందించిన గోడ పత్రిక (వాల్ పోస్టర్స్)ను కమిషన్ చైర్‌పర్సన్ వేటుకూరి ఎ.వి.ఎస్. సూర్యనారాయణ రాజు, కమిషన్ సభ్యులు తో పాటు







హెల్ప్ కార్యదర్శి నిమ్మరాజు రామమోహన్ సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్‌పర్సన్ వేటుకూరి ఎ.వి.ఎస్.సూర్యనారాయణ రాజు మాట్లాడుతూ, ప్రస్తుతం మానవ అక్రమ రవాణా పద్ధతులు పూర్తిగా మారిపోయాయని తెలిపారు. ఒకప్పుడు ప్రత్యక్షంగా జరిగే అక్రమ రవాణా ఇప్పుడు నకిలీ ఉద్యోగ ప్రకటనలు, అధిక వేతనాల హామీలు, సోషల్ మీడియా పరిచయాలు, ఆన్‌లైన్ ప్రేమ ఉచ్చులు, విదేశీ ఉద్యోగ అవకాశాల పేరుతో జరిగే సైబర్ ఆధారిత నేరంగా మారిందన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆయుధంగా మార్చుకున్న అక్రమ రవాణా ముఠాలను ఎదుర్కోవాలంటే డిజిటల్ అవగాహన, సైబర్ భద్రతపై ప్రజల్లో చైతన్యం అత్యంత అవసరమని పేర్కొన్నారు. భారత రాజ్యాంగం ప్రతి చిన్నారికి కల్పించిన హక్కులు రాష్ట్రంలోని ప్రతి బిడ్డకు అందేలా చేయడంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ పూర్తిగా కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా నిరంతరం పర్యవేక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. "బాల సంవాద్" కార్యక్రమాల ద్వారా పిల్లల అభిప్రాయాలను తెలుసుకుంటూ, జిల్లా మరియు గ్రామ స్థాయిలో బాలల రక్షణ వ్యవస్థలను మరింత బలోపేతం చేస్తున్నామని చెప్పారు. అలాగే బాలల సంక్షేమ పథకాల అమలును పర్యవేక్షిస్తూ, బాలల అక్రమ రవాణా, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, బాలలపై లైంగిక దాడుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ప్రభుత్వ శాఖలు, పోలీసు శాఖ, బాలల సంక్షేమ కమిటీలు, జువెనైల్ జస్టిస్ బోర్డులు, జిల్లా బాలల రక్షణ విభాగాలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలతో సమన్వయంగా పనిచేస్తూ ప్రతి చిన్నారి సురక్షితమైన, గౌరవప్రదమైన బాల్యాన్ని అనుభవించేలా కమిషన్ కృషి కొనసాగిస్తోందని ఆయన పేర్కొన్నారు. హెల్ప్ సంస్థ కార్యదర్శి నిమ్మరాజు రామమోహన్ మాట్లాడుతూ ఇటీవల సింగపూర్‌లో ఉద్యోగాలు కల్పిస్తామని నమ్మించి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలువురు యువతను మయన్మార్‌కు తరలించి, అక్కడ సైబర్ స్కామ్ కేంద్రాల్లో బలవంతంగా పనిచేయించిన సంఘటనను ప్రస్తావిస్తూ, అది కేవలం సైబర్ నేరం మాత్రమే కాదని, అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా ముఠాలు అమాయక యువత కలలను ఎలా దోపిడీ చేస్తున్నాయో చూపించే అత్యంత విషాదకర ఉదాహరణ అని పేర్కొన్నారు. "మంచి భవిష్యత్తు కోసం ప్రారంభమైన ప్రయాణం చివరకు భయం, బానిసత్వం, దోపిడీగా మారడం ప్రతి కుటుంబానికి గట్టి హెచ్చరిక" అని ఆయన అన్నారు. విదేశీ ఉద్యోగాలు, అధిక వేతనాలపై వచ్చే ప్రకటనలను నమ్మే ముందు పూర్తి స్థాయిలో ధృవీకరించుకోవాలని యువతకు సూచించారు. ఈ కార్యక్రంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు ఉండవల్లి గాంధీ బాబు, వెంకట పద్మలత, చల్లా మధుసూధన రావు, హెల్ప్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వి.భాస్కర రావు, కమ్యునికేషన్ ఆఫీసర్ అనురాధతో పాటు షుమారు 60 మందికి పైగా యువత, మహిళలు, విముక్తి సభ్యులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# డీఎస్సీపై మాట్లాడే హక్కు జగన్‌కు లేదు : కూరపాటి

**పల్నాడు జిల్లా ప్రతినిధి, (రాజధాని వార్తలు):** అధికారంలో ఉన్న ఐదేళ్లలో జగన్ ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించకుండా లక్షలాది మంది నిరుద్యోగ యువతను తీవ్ర నిరాశకు గురి చేశాడని, ఆంధ్రప్రదేశ్‌లో నిరుద్యోగుల ఆశలను దెబ్బతీసింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని, మెగా డీఎస్సీపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేస్తున్న ఆరోపణలు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమైనవని పల్నాడు జిల్లా టీఎన్‌ఎస్‌ఎఫ్ అధ్యక్షుడు కూరపాటి హనుమంతరావు విమర్శించారు. గురువారం నరసరావుపేటలోని పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని హామీ ఇచ్చినా, ఒక్కసారి కూడా ఆ హామీని అమలు చేయలేదని విమర్శించారు. ఉపాధి అవకాశాలు కల్పించడంలో పూర్తిగా విఫలమైన ప్రభుత్వం ఇప్పుడు మెగా డీఎస్సీపై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా





చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో పారదర్శకంగా మెగా డీఎస్సీ నిర్వహించి 16 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిందని హనుమంతరావు పేర్కొన్నారు. రాత్రింబవళ్లు కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల విజయాన్ని అవమానించేలా వైఎస్సార్‌సీపీ నాయకులు వ్యాఖ్యలు చేయడం బాధాకరమని అన్నారు. నియామకాలు పూర్తై నెలలు గడిచిన తర్వాత అకస్మాత్తుగా అవినీతి ఆరోపణలు చేయడం వెనుక రాజకీయ ఉద్దేశాలే ఉన్నాయని, జగన్ ప్రభుత్వ హయాంలో ఉపాధి కల్పనకు అవసరమైన నోటిఫికేషన్లు విడుదల చేయడంలో నిర్లక్ష్యం చూపడంతో పాటు, పరిశ్రమలకు అనుకూల వాతావరణం కల్పించడంలో కూడా విఫలమైందని ఆయన విమర్శించారు. దీంతో యువత ఉపాధి అవకాశాలు కోల్పోయిందని పేర్కొన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలెండర్ అమలు వంటి చర్యలు చేపడుతుండటాన్ని జీర్ణించుకోలేక తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు,నీట్ పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీ వంటి అంశాలపై వైఎస్సార్‌సీపీ చిత్తశుద్ధితో స్పందించలేదని, అలాంటి పార్టీ ఇప్పుడు డీఎస్సీపై మాట్లాడటం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనని హనుమంతరావు అన్నారు. విద్యాశాఖలో నారా లోకేష్ తీసుకొస్తున్న మార్పులు, విద్యా వ్యవస్థను బలోపేతం చేసే చర్యలకు ప్రజల్లో మంచి స్పందన వస్తోందని, అదే వైఎస్సార్‌సీపీకి అసహనంగా మారిందని వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం నిరుద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో కూడా జాబ్ క్యాలెండర్‌ను క్రమం తప్పకుండా అమలు చేస్తుందని, మరిన్ని డీఎస్సీ నోటిఫికేషన్లు విడుదల చేసి ఉద్యోగాల భర్తీ చేపడుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఎలాంటి రాజకీయ విమర్శలు వచ్చినా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా టిఎన్‌ఎస్‌ఎఫ్ వైస్ ప్రెసిడెంట్ చల్లా రవీంద్ర, జిల్లా అధికార ప్రతినిధి దైద చిన్నబాబు, నరసరావుపేట నియోజకవర్గ అధ్యక్షుడు ఏనుగంటి భార్గవ్ సాయి మరియు టిఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

# ఇప్పుడు గ్లోబల్ ఇన్వెస్టర్ల ఎంపిక ఆంధ్రప్రదేశ్

**- గత ప్రభుత్వ చర్యలతో పెట్టుబడిదారుల విశ్వాసం కోల్పోయింది - త్వరలో ఆంధ్రప్రదేశ్ నుంచి విదేశాలకు క్లీన్ ఎనర్జీ ఎగుమతులు**

**- పరిశ్రమలు తేవడం మా బాధ్యత - కష్టపడటం యువత బాధ్యత - టాటా రెన్యువబుల్ ఎనర్జీ శంకుస్థాపన సభలో మంత్రి నారా లోకేష్**










**పత్తికొండ, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు గ్లోబల్ ఇన్వెస్టర్ల తొలి ఎంపిక అయ్యిందని విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. బ్రూక్‌ఫీల్డ్, బ్లాక్‌స్టోన్, బ్లాక్‌రాక్, జూలు, టిపిజి వంటి గ్లోబల్ ప్రైవేట్ ఈక్విటీ ఫండ్‌లు ఏపీలో పెట్టుబడులు పెడుతున్నాయని, టాటా పవర్, సుజ్లాన్, రెన్యూ, ప్రీమియర్ ఎనర్జీస్, ఏసిఎంఇ, వారీ వంటి ప్రముఖ భారతీయ కంపెనీలు ఇక్కడ విస్తరిస్తున్నాయని లోకేష్ వెల్లడించారు. పత్తికొండ సమీపంలోని హోసూరులో టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూ. 5,350కోట్లతో అనంతపురం, కర్నూలు జిల్లాల్లో ఏర్పాటుచేయబోయే 800 మెగావాట్ల క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు గురువారం మంత్రి లోకేష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో లోకేష్ మాట్లాడుతూ... గత ఏడాదితో పోలిస్తే, ఈ ఒక్క సంవత్సరంలోనే ఆంధ్రప్రదేశ్‌లో పునరుత్పాదక ఇంధన సామర్థ్యం 400% పెరిగిందని, ఇది రాష్ట్ర విశ్వసనీయతను పునరుద్ధరించడం వల్లే సాధ్యమైందన్నారు.

**పెట్టుబడిదారుల్లో నమ్మకం పెంపొందించాం**

రాష్ట్రంలో 2024 జూన్‌లో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు, పునరుత్పాదక ఇంధన రంగం పూర్తిగా అస్తవ్యస్తంగా ఉండేది. అంతకుముందు ఐదేళ్లలో కనీసం ఒక్క మెగావాట్ సామర్థ్యం గల ప్రధాన రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టు కూడా ప్రారంభించలేదు. విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను ఏకపక్షంగా రద్దు చేశారు. పెట్టుబడిదారుల్లో విశ్వాసం దెబ్బతింది. ప్రపంచంలోని అనేక అతిపెద్ద ఇన్ఫ్రా, క్లైమెట్ ఫండ్స్ ఆంధ్రప్రదేశ్‌ను బ్లాక్‌లిస్ట్‌లో చేర్చాయి. ఒకసారి దెబ్బతిన్న విశ్వాసాన్ని పునరుద్ధరించడం రాత్రికి రాత్రే సాధ్యంకాదు. పెట్టుబడిదారుల్లో మళ్లీ నమ్మకాన్ని పెంపొందిస్తూ వచ్చాం.

**ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీతో తొలి అడుగు**

ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ – 2024ను ప్రవేశపెట్టి విస్తృతమైన విజన్‌తో 160 గిగావాట్ల క్లీన్ ఎనర్జీ సామర్థ్యాన్ని సాధించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం. సోలార్ మాడ్యూల్స్, సెల్స్ నుండి బ్యాటరీలు, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా, ట్రాన్స్ మిషన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, పోర్ట్స్, స్టోరేజీ సిస్టమ్స్... ప్రపంచ స్థాయి తయారీ వరకు – మొత్తం క్లీన్ ఎనర్జీ సప్లయ్ చైన్‌ను ఆంధ్రప్రదేశ్‌లో నిర్మించాలని అనుకున్నాం. ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛ ఇంధనాన్ని వినియోగించుకోవడమే కాకుండా, క్లీన్ ఎనర్జీ టెక్నాలజీలకు గ్లోబల్ ప్రొడ్యూసర్‌గా మారాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం.

**టాటా రెన్యువబుల్ ప్రాజెక్ట్.. మా విజన్‌కు నిదర్శనం**

టాటా రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్ 5,750 కోట్ల పెట్టుబడితో, పత్తికొండలో 400 మెగావాట్ల సౌర విద్యుత్‌ను, అనంతపురం జిల్లా కనేకల్లులో 400 మెగావాట్ల పవన విద్యుత్‌తో కలిపి, 800 మెగావాట్ల హైబ్రిడ్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టుగా అవతరించబోతోంది. ఈ ఒక్క ప్రాజెక్ట్ నిర్మాణ సమయంలో దాదాపు 4,000 ఉద్యోగాలను కల్పిస్తుంది. 3,400 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో గల ఈ ప్రాజెక్టు ద్వారా 1,100 పైగా రైతు కుటుంబాలకు దాదాపు మూడు దశాబ్దాల పాటు స్థిరమైన కౌలు ఆదాయాన్ని అందిస్తుంది. ఈ ప్రాజెక్ట్ ఆంధ్రప్రదేశ్‌పైనా, మా పరిపాలనపైనా విశ్వాసానికి ప్రతీక.

**టాటా గ్రూప్‌తో మాకు ప్రత్యేకమైన అనుబంధం**

టాటా గ్రూప్‌తో మాకు దశాబ్దాల తరబడి అనుబంధం ఉంది. 1990లో నా తండ్రి చంద్రబాబు నాయుడు హైదరాబాద్‌లో 'హైటెక్ సిటీ'ని నిర్మిస్తున్నప్పుడు, ఆయన దార్శనికతను నమ్మిన మొట్టమొదటి సంస్థలలో టిసిఎస్ ఒకటి. ఆ నమ్మకంతో కూడిన అనుబంధం నేటికీ కొనసాగుతోంది. 2024లో మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, నేను టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్‌ను కలిసి ప్రపంచ స్థాయి పెట్టుబడులను ఆకర్షించడానికి ఆంధ్రప్రదేశ్ భిన్నంగా ఏమి చేయాలి అని అడిగాను. "వేగంపై దృష్టి పెట్టండి. పెట్టుబడిదారులకు ప్రోత్సాహకాల కంటే జాప్యం వల్ల కలిగే నష్టమే ఎక్కువ," అని ఆయన చెప్పారు. మా ప్రభుత్వ విధానం కూడా Simple, Speed, Stability లో వేగం భాగం అయ్యింది. శంకుస్థాపన నుండి ప్రారంభోత్సవం వరకు ప్రభుత్వం మద్దతుగా నిలబడుతుందనే విశ్వాసం మేము పెట్టుబడిదారులకు కల్పిస్తున్నాం.

**స్వచ్ఛ ఇంధనం ఎగుమతి చేస్తాం**

భారతదేశంలోనే అత్యంత పొడవైన తీరప్రాంతం, సమృద్ధిగా పునరుత్పాదక వనరులు, ప్రపంచ స్థాయి ఓడరేవులు ఉన్న ఆంధ్రప్రదేశ్ గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ఎగుమతులకు భారతదేశపు ముఖద్వారంగా మారడానికి మాకు అవకాశం కల్పిస్తున్నాయి. అతి త్వరలో ఆంధ్రప్రదేశ్‌లో ఉత్పత్తి అయ్యే స్వచ్ఛమైన ఇంధనాన్ని తీసుకువెళ్లే ఓడలు యూరప్, జపాన్, కొరియా, ప్రపంచంలోని ఇతర ప్రాంతాలకు ప్రయాణిస్తాయి. క్లీన్ మాలిక్యులస్, గ్రీన్ ఫ్యూయల్స్, సాంకేతికతలను ఎగుమతులూ ఏపీ నుంచి చేసే స్థాయికి చేరతాం.

**సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కలిసి పనిచేయాలి**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఐఐటి తిరుపతి, యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్ వేల్స్ (ఆస్ట్రేలియా) సహకారంతో సోలార్ మ్యానుఫ్యాక్చరింగ్, రెన్యువబుల్ ఎనర్జీ టెక్నాలజీల కోసం ఏర్పాటు చేస్తున్న ఒక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కలిసి పనిచేయాలని టాటా పవర్‌ను ఆహ్వానిస్తున్నాం. మనం కలిస్తే భారతదేశపు స్వచ్ఛ ఇంధన భవిష్యత్తును నిర్మించే ఇంజనీర్లు, పరిశోధకులు, సాంకేతిక నిపుణులు, పారిశ్రామికవేత్తలను తయారు చేయగలం. టాటా రెన్యువబుల్ ఎనర్జీ కార్యరూపం దాల్చడానికి కృషి చేసిన ప్రతీ ఒక్కరికీ అభినందనలు తెలియజేస్తున్నాను.

**సుజ్లాన్‌కు ప్రత్యేక అభినందనలు**

దశాబ్దాలుగా, భారతదేశ పవన శక్తి రంగంలో సుజ్లాన్ అగ్రగామి పాత్ర పోషిస్తున్న సుజ్లాన్ పవన శక్తి ప్రాజెక్ట్ అభివృద్ధిలో భాగం కావడం ఆంధ్రప్రదేశ్ పునరుత్పాదక ఇంధన లక్ష్యాలకు గొప్ప బలాన్ని చేకూరుస్తుంది. ఈ ప్రాజెక్ట్ కోసం అవసరమైన విండ్ టర్బైన్‌లను అనంతపురంలోనే సుజ్లాన్ ఏర్పాటు చేసిన కేంద్రంలో తయారు కావడం ఏపీలో సమగ్ర పారిశ్రామిక వ్యవస్థ అభివృద్ధికి మరో నిదర్శనం. విండ్ టర్బైన్‌ల తయారీ, నిర్వహణలో యువతకు నైపుణ్య శిక్షణనిచ్చే కేంద్రాలను కూడా ఏర్పాటుచేసి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రస్థానంలో దీర్ఘకాలిక భాగస్వామిగా నిలిచినందుకు సుజ్లాన్ యాజమాన్యం, బృందానికి కృతజ్ఞతలు.

**వజ్రాల నేల..బంగారంలాంటి ప్రజలు**

అశోకుడు పాలించిన గొప్ప నేల పత్తికొండ. పత్తికొండలో యువశక్తి అదిరిపోయింది. బంగారు గనులు ఉన్న ప్రాంతం ఇది, బంగారంలాంటి ప్రజలు ఉన్న నేల ఇది. జొన్నగిరి గోల్డ్ ఇప్పుడు ఏపీకే బ్రాండ్. పత్తికొండ బంగారం గురించి ఇప్పుడు ప్రపంచం మొత్తం మాట్లాడుతుంది. ఈ నేలలో వజ్రాలు దొరుకుతాయి, వజ్రాలలాంటి యువకులు ఇక్కడ ఉన్నారు. పెరవలి రంగనాథ స్వామి ఆలయం, పత్తికొండ సాయిబాబా ఆలయం ఉన్న పుణ్య భూమి పత్తికొండ.

**కర్నూలు ప్రజల అభిమానం మరువలేను**

ఉమ్మడి కర్నూలు జిల్లా అంటే నాకు ఇష్టం. నేను పాదయాత్రలో వచ్చినప్పుడు ప్రజలు చూపిన ప్రేమ ఎప్పటికి మర్చిపోలేను. నేను 45 రోజులు, 14 నియోజక వర్గాల్లో పాదయాత్ర చేసాను. నాకు కర్నూలు జిల్లా ప్రజల సమస్యలు తెలుసు, కష్టాలు, వలసలు నేను చూశాను. నేను పత్తికొండ వచ్చినప్పుడు అప్పటి ప్రభుత్వం నన్ను అడ్డుకోవడానికి 1000 మంది పోలీసులను పంపింది. పత్తికొండ ప్రజలు నాకు మద్దతుగా నిలిచారు. అందుకే మీ రుణం తీర్చుకుంటున్నా. ఉమ్మడి కర్నూలు జిల్లా అభివృద్ధిని బాధ్యతగా తీసుకున్నా. గౌరవ ముఖ్యమంత్రి, నేను, మంత్రి టిజి భరత్ ప్రపంచం మొత్తం తిరిగి రాష్ట్రానికి అనేక కంపెనీలు తీసుకొస్తున్నాం. కర్నూలు జిల్లాకు కూడా అనేక పరిశ్రమలు రాబోతున్నాయి. పరిశ్రమలు తీసుకురావం మా బాధ్యత. కానీ కష్టపడి పనిచేయాల్సిన బాధ్యత యువకులపై ఉంది. కష్టం, ప్రతిభ రెండూ ఉండాలి. అప్పుడే కంపెనీలకు నమ్మకం వస్తుంది.

**ఇండస్ట్రీ కనెక్ట్‌తో నైపుణ్యాభివృద్ధి**

నాకు ఒక వింత పరిస్థితి ఎదురవుతోంది. మేము కంపెనీ పెట్టడానికి సిద్దంగా ఉన్నాం, మీ దగ్గర స్కిల్ ఉన్న యూత్ ఉన్నారా అని కొంతమంది పారిశ్రామికవేత్తలు అడుగుతున్నారు. అందుకే ఇప్పుడు ఐటిఐలని ఇండస్ట్రీతో కనెక్ట్ చేస్తున్నాం. ఒక్కో ఐటీఐని ఒక్కో కంపెనీకి అటాచ్ చేస్తున్నాం. ఇండస్ట్రీకి కావాల్సిన విధంగా యూత్‌ని సిద్ధం చేస్తున్నాం. మొన్నే శ్రీసిటీలో యూనివర్సిటీని ప్రారంభించాను. ఇది ఇండియాలోనే నేర్చుకోండి – సంపాదించండి – గ్రాడ్యుయేట్ అవ్వండి మోడల్‌లో నిర్వహించే తొలి యూనివర్సిటీ. మూడు నెలలు క్లాస్ రూములో, 8 నెలలు ఇండస్ట్రీలో వర్క్. చదువుకుంటూనే సంపాదిస్తారు. చదువు పూర్తయ్యేసరికి ఉద్యోగానికి కావాల్సిన నైపుణ్యాలు సంపాదిస్తారు.

**దేశానికి నాయకత్వం వహించే ఏపీని నిర్మిద్దాం**

'టాటా' అనే పేరు ఎల్లప్పుడూ నమ్మకం, నిజాయితీ, దేశ నిర్మాణం, ఆవిష్కరణలకు మారుపేరుగా నిలిచింది. ఆంధ్రప్రదేశ్‌తో టాటా బంధం చాలా బలీయమైనది. ప్రభుత్వం, పారిశ్రామిక రంగం, రైతులు, ప్రజలు...కలిసి క్లీన్ ఎనర్జీ, పరస్పర విశ్వాసం, భాగస్వామ్య స్ఫూర్తితో కూడిన సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తున్నాం. భారతదేశానికి దిశానిర్దేశం చేసే ఆంధ్రప్రదేశ్‌ను, స్వచ్ఛ ఇంధన రంగంలో ప్రపంచానికే నాయకత్వం వహించే భారతదేశాన్ని మనం కలిసి నిర్మిద్దామని మంత్రి లోకేష్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టాటా పవర్ సిఇఓ & ఎండి ప్రవీర్ సిన్హా, టాటా పవర్ రెన్యువబుల్ ఎనర్జీ సిఇఓ & ఎండి సంజయ్ బంగా, సుజలాన్ వైస్ చైర్మన్ గిరీష్ తంతి, భారీ పరిశ్రమల మంత్రి టిజి భరత్, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, కె.ఇ. శ్యామ్ బాబు, జిల్లా కలెక్టర్ డా.ఎ.సిరి, టాటా పవర్, సుజ్లాన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# మంత్రి నారాయణ కృషితో శరవేగంగా అభివృద్ధి

**- నెల్లూరు పార్లమెంట్ టీడీపీ కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర రెడ్డి**





**కోవూరు /నెల్లూరు, (రాజధాని వార్తలు):** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా మంత్రి నారాయణ కృషితోనే నెల్లూరు నగరం శరవేగంగా అభివృద్ధి జరుగుతుంది అని టీడీపీ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి అన్నారు. పాలన సందర్భంగా రాష్ట్ర తెలుగుదేశం పార్టీ పిలుపు మేరకు రెండేళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమ పేరుతో జరుగుతున్న ఇంటింటి ప్రచార కార్యక్రమంలో భాగంగా నెల్లూరు సిటీ నియోజకవర్గ పరిధిలోని 44 వ డివిజన్ బరాకాస్ సెంటర్ – పెద్దబజార్‌లో జరిగిన కార్యక్రమములో తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని స్థానిక నాయకులతో కలసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ విజయాలను వివరించారు. ఈ సందర్భంగా చేజర్ల వేంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తనకున్న అనుభవంతో, కేంద్ర ప్రభుత్వ సహకారంతో అగాధంలో ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపించారు. అనేక ఆర్థిక సమస్యలు ఉన్న ఎన్నికలో ఇచ్చిన హామీలను 80 శాతం అమలు చేశారు. మన్ననే కుటుంబంలో ఎంతమంది పిల్లలు చదువుతున్నా అంతమందికీ తల్లికి వందనం క్రింద ఒక్కొక్కరికీ 13 వేలు ఇవ్వడం జరిగింది. చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ కృషితో రాష్టానికి పెద్దఎత్తున పెట్టుబడులు వస్తున్నాయి. దీనివలన యువతకు పెద్ద ఎత్తున ఉపాధి,ఉద్యోగ అవకాశాలు వస్తాయి. నారా లోకేష్ విద్యా శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత విద్యా రంగంలో సమూల మార్పులు తెచ్చారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్దారు. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. నెల్లూరు సిటీ శాసన సభ్యులు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ కృషితో నెల్లూరు నగరం శరవేగంగా అబివృద్ధి చెందుతుందని అన్నారు నెల్లూరు నగరంలో మౌలిక సదుపాయాలు కల్పనకు పెద్ద పీట వేశారు. నెల్లూరు సిటీలో ఉన్న విఆర్ పాఠశాలతో పాటు అనేక ప్రభుత్వ పాఠశాలలను కార్పోరేట్ పాఠశాలలు కంటే మెరుగ్గా తీర్చిదిద్దారు.

నెల్లూరు నగరంలో 4 కోట్ల రూపాయలు తన సొంత నిధులతో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు కు ఒకే రోజు 7000 సైకిళ్లు పంపిణీ చేసి నారాయణ రికార్డు సృష్టించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఇంటూరు విజయ్ తదితరులు స్థానిక టీడీపీ నేతలు ఉన్నారు.

# భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు

**- ఏ పి ఈ ఎమ్ సీ ఎల్ చైర్మెన్ పోలంరెడ్డి దినేష్ రెడ్డి**





**భోగాపురం, (రాజధాని వార్తలు):** ఆగష్టు 1న భోగాపురంలో జరుగనున్న అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవంకు ఏర్పాట్లు చేయునున్నట్లు రాష్ట్ర ఏ పి ఈ ఎమ్ చైర్మెన్ పొలంరెడ్డి దినేష్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పర్యటన విజయవంతం అయ్యేలా, నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు జరుగుతున్న ఏర్పాట్లను తాము పరిలించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా సాలూరు నియోజక వర్గంలోని సాలూరు పట్టణంలో, మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి ఆధ్వర్యంలో కూటమి నాయకులు అందరూ కలిసి ముఖ్య సమావేశం నిర్వహించామని ఒక ప్రకటనలో అన్నారు. కార్యక్రమానికి భారీ సంఖ్యలో ప్రజలు హాజరు కానున్న నేపథ్యంలో, నియోజకవర్గం నుండి భోగాపురం వరకు భోజన పంపిణీ కేంద్రాల ఏర్పాటు, సమర్థవంతమైన పంపిణీ విధానం, ప్రజల రాకపోకలకు అవసరమైన వాహనాల ఏర్పాటు మరియు సమన్వయం గురించి సమగ్రంగా చర్చించాము. మంత్రి గుమ్మిడి సంధ్యారాణి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి, నియోజకవర్గం నుండి వచ్చే ప్రజలకు కల్పిస్తున్న సౌకర్యాలు, వాహనాల ఏర్పాట్ల పురోగతిని సమీక్షించి, కార్యక్రమం విజయవంతం అయ్యేలా అవసరమైన సూచనలు అందించామని చెప్పారు. ఈ మహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కూటమి నాయకులు, పార్టీ కార్యకర్తలు అందరూ సమన్వయంతో పనిచేయాలని కోరుతున్నానని చెప్పారు.

# మద్యం దుకాణాలపై పోలీసులకు ఫిర్యాదు చేసిన ఐద్వా

**రేణిగుంట, (రాజధాని వార్తలు):** తిరుపతి జిల్లా రేణిగుంట పట్టణంలో ఇటీవల క్రింది రెండు నూతన మద్యం దుకాణాలను ఏర్పాటు చేశారు. రేణిగుంట ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గల సర్వేశ్ వైన్స్, వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం సర్కిల్ సమీపంలో ఆధ్య వైన్స్ ఈ రెండు మద్యం దుకాణాలు జనావాస ప్రాంతంలో, పాఠశాలలు, దేవాలయాలు, బస్టాండ్, రైల్వే స్టేషన్‌కు సమీపంలో ఉన్నాయని, గతంలో కూడా ఇదే ప్రాంతంలో మద్యం దుకాణాలు ఉండగా ప్రజల అభ్యంతరాల మేరకు తొలగించడం జరిగిందని, తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే లక్షలాది మంది భక్తులు, రేణిగుంట రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్ ద్వారా ప్రయాణిస్తుంటారని, అలాంటి ప్రాంతంలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడం ప్రజా ప్రయోజనాలకు, మహిళల భద్రతకు, చిన్నారుల రక్షణకు విరుద్ధం అని ఫిర్యాదుల పేర్కొన్నారు. కాబట్టి ప్రజల అభిప్రాయాన్ని గౌరవిస్తూ, మహిళల భద్రతను దృష్టిలో ఉంచుకొని, పై రెండు మద్యం దుకాణాలను వెంటనే తొలగించాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. అలాగే ఈ విషయంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే, ఎక్సైజ్ శాఖ అధికారులు మరియు పోలీసు అధికారులు వెంటనే జోక్యం చేసుకుని చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఐద్వా, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య బద్ధమైన ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాల్సి వస్తుందని తెలిపారు.

# పిల్లలకు ఎక్కడ అన్యాయం జరిగినా వెంటనే 1098కు ఫోన్ చేయండి

**- బాల కార్మికులు, బాల్య వివాహాలు, సోషల్ మీడియా దుష్ప్రభావాలపై రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక కార్యాచరణ - పిల్లల హక్కులను కాలరాసే వారిపై కఠిన చర్యలు తప్పవు : రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ వేటుకూరి ఏవీఎస్ సూర్యనారాయణ రాజు**






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** పిల్లల హక్కులను పరిరక్షించడంలో రాజీ పడే ప్రసక్తే లేదని, ఎక్కడైనా పిల్లలపై వేధింపులు, దోపిడీ, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, హక్కుల ఉల్లంఘనలు జరిగినా వెంటనే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ వేటుకూరి ఏవీఎస్ సూర్యనారాయణ రాజు పిలుపునిచ్చారు. బుధవారం నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రతి చిన్నారి సురక్షితంగా, విద్యావంతుడిగా, ఆరోగ్యవంతంగా ఎదిగేలా రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. పిల్లల్లో పెరుగుతున్న చెడు అలవాట్లు, సోషల్ మీడియా దుష్ప్రభావాలు, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, చిన్నారులను నేర కార్యకలాపాలకు వినియోగించే ధోరణిపై కమిషన్ సభ్యులు, నిపుణులతో కలిసి విస్తృత అధ్యయనం నిర్వహించి సమగ్ర నివేదిక సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ నివేదికను త్వరలో రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించి, అందులోని సూచనల ఆధారంగా పటిష్టమైన కార్యాచరణ అమలు చేయాలని ప్రతిపాదిస్తున్నామని చెప్పారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్య వివాహాల నివారణ కోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా సోషల్ మీడియా ప్రభావంతో పిల్లలు మానసిక, సామాజిక సమస్యలను ఎదుర్కొంటున్న నేపథ్యంలో వారికి అవగాహన కల్పించే ప్రత్యేక రాష్ట్రవ్యాప్త ప్రచార కార్యక్రమాన్ని కమిషన్ ఆధ్వర్యంలో త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం పిల్లల సంక్షేమం కోసం కేటాయిస్తున్న నిధులు పూర్తి స్థాయిలో వారికి ఉపయోగపడేలా పర్యవేక్షణ కొనసాగిస్తామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు కేటాయించిన సీట్ల అమలుపైనా ప్రత్యేక దృష్టి సారించి, ఏ ఒక్క చిన్నారి విద్యకు దూరం కాకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పిల్లల హక్కులకు భంగం కలిగించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని చైర్మన్ స్పష్టం చేశారు. బాల కార్మికులను పనిలో పెట్టుకునే వారు, బాల్య వివాహాలకు పాల్పడేవారు, చిన్నారులను డ్రగ్స్, గంజాయి, మద్యం అక్రమ రవాణా వంటి నేరాలకు వినియోగించే ముఠాలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పిల్లలను నేరాల బారిన పడకుండా కాపాడటం సమాజం, ప్రభుత్వ యంత్రాంగం, తల్లిదండ్రుల ఉమ్మడి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి బాలుడు విద్యను అభ్యసించాలనే లక్ష్యంతో అమలులో ఉన్న విద్యా హక్కు చట్టం, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల ఉచిత విద్య, పౌష్టికాహార పథకాలు సమర్థవంతంగా అమలవుతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'తల్లికి వందనం' కార్యక్రమం ద్వారా ప్రతి చిన్నారి చదువును కొనసాగించి ఆరోగ్యవంతమైన భవిష్యత్తు వైపు అడుగులు వేయాలని ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇటీవల ఒక స్వచ్ఛంద సంస్థ సమాచారంతో విజయవాడ రైల్వే స్టేషన్‌లో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన 17 మంది చిన్నారులను గుర్తించి అధికారులకు అప్పగించినట్లు వివరించారు. వారికి రక్షణ కల్పించి సంరక్షణ గృహాల్లో చేర్చే చర్యలు చేపట్టామని తెలిపారు. రాబోయే రోజుల్లో చైల్డ్ లైన్-1098, పోలీసు శాఖ, రైల్వే పోలీసులు, మహిళా శిశు సంక్షేమ శాఖ, డీజీపీ యూనిట్, రైల్వే శాఖల సమన్వయంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక రెస్క్యూ ఆపరేషన్లు నిర్వహించి బాల కార్మికులను గుర్తించడం, తప్పిపోయిన చిన్నారులను రక్షించడం, తల్లిదండ్రుల వద్దకు చేర్చడం, కౌన్సెలింగ్ అందించడం వంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపడతామని వెల్లడించారు. పిల్లలకు ఎక్కడైనా అన్యాయం జరిగినా, వారి హక్కులకు భంగం కలిగినా, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, వేధింపులు లేదా దోపిడీ ఘటనలు కనిపించినా వెంటనే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని రాష్ట్ర ప్రజలకు చైర్మన్ విజ్ఞప్తి చేశారు. ప్రతి ఫిర్యాదుపై కమిషన్ తక్షణమే స్పందించి బాధిత చిన్నారికి రక్షణ కల్పిస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

ఈ పాత్రికేయుల సమావేశంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు కేజీ వెంకట పద్మలత, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ హేనా సుజన్, జిల్లా బాలల సంరక్షణ అధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# మూడో రోజుకి చేరిన విక్రమ సింహపురి యూనివర్సిటీ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల నిరవధిక నిరసన దీక్ష

**- కాంట్రాక్టు అధ్యాపకులకు సంఘీభావం తెలిపిన వర్శిటీ విద్యార్థులు - దీక్షా శిబిరంలో కూర్చుని సంపూర్ణ మద్దతు ప్రకటన**



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** విక్రమ సింహపురి యూనివర్సిటీ అసోసియేషన్ ఆఫ్ అసిస్టెంట్ ప్రొఫెసర్స్ ఆన్ కాంట్రాక్ట్ ఆధ్వర్యంలో తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నెల్లూరు కాకుటూరులోని వర్శిటీ క్యాంపస్‌లో చేపట్టిన నిరవధిక నిరసన దీక్ష బుధవారం నాటికి మూడవ రోజుకు చేరుకుంది. మూడవ రోజు దీక్షకు యూనివర్శిటీ విద్యార్థుల నుండి విశేష మద్దతు లభించింది. వర్శిటీలోని వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు స్వచ్ఛందంగా దీక్షా శిబిరం వద్దకు చేరుకున్నారు. ఎన్నో ఏళ్లుగా తమకు నాణ్యమైన విద్యను అందిస్తూ, తమ భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోరాటానికి విద్యార్థులు తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు. అధ్యాపకులతో పాటు కాసేపు దీక్షా శిబిరంలో కూర్చుని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ యూనివర్శిటీ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల న్యాయమైన డిమాండ్లైన మినిమం టైమ్ స్కేల్ అమలు, రెగ్యులరైజేషన్, సర్వీసు పరిగణన వంటి అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం మరియు వర్శిటీ అధికారులు వెంటనే పరిష్కరించాలని కోరారు. తమ గురువుల సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు తమ మద్దతు కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు, కావలి యూనివర్శిటీ కళాశాలల్లో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు మరియు వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నారద పుష్కరిణిని పరిశీలించిన ఈవో బికే వెంకటేశులు



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం అనుబంధ ఆలయమైన విజ్ఞానగిరి కుమారస్వామి ఆడికృతిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న సందర్భంగా ఈవో బికే వెంకటేశులు, ఆలయ అధికారులు నారద పుష్కరిణిని, కుమార స్వామి కొండను పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు ఈఓ పలు సూచనలు చేశారు.

# రామచంద్రాపురాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా నిలుపుతాం

**- రెండేళ్లలోనే రూ.2.18 కోట్లతో అభివృద్ధి, సంక్షేమం - కూటమి రెండేళ్ల పాలనలో ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకున్నాం - గత ఐదేళ్ల పాలనలో నిరుద్యోగులను విస్మరించిన వారికి మెగా డీఎస్సీపై మాట్లాడే హక్కు లేదు - 'రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం' పర్యటనలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను దాదాపు పూర్తిగా అమలు చేశామని, అందుకే రెండేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమాన్ని ప్రజల ఇంటి వద్దకే వెళ్లి చెప్పే ధైర్యం తమ కూటమి ప్రభుత్వానికే ఉందని కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా బుధవారం బుచ్చిరెడ్డిపాళెంలోని 20వ వార్డు రామచంద్రాపురంలో నిర్వహించిన 'రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం' ఇంటింటి ప్రచార కార్యక్రమంలో ఎమ్మెల్యే గారు పాల్గొన్నారు. స్థానిక నివాసాలకు స్వయంగా వెళ్లిన ప్రశాంతి రెడ్డి.. సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేసి, ప్రభుత్వ పాలనపై ప్రజల అభిప్రాయాలను, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానికులను ఉద్దేశించి మాట్లాడారు.

**ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకున్నాం**

ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేసిందన్నారు. చేసిన పనులను ప్రజలకు వివరించడంతో పాటు, ఇంకా చేయాల్సిన పనులను గుర్తించి పరిష్కరించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపు మేరకు ఇంటింటికీ వెళ్తున్నామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారమే సామాజిక పింఛన్లను రూ.4 వేలకు పెంచామని, ప్రతి విద్యార్థి కోసం 'తల్లికి వందనం', మహిళల కోసం 'స్త్రీశక్తి' ఉచిత బస్సు ప్రయాణం, రైతుల కోసం 'అన్నదాత సుఖీభవ', మత్స్యకారుల కోసం 'మత్స్యకారుల సేవలో', ఆటో డ్రైవర్ల కోసం 'ఆటో సేవలో' వంటి పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. లబ్ధిదారుల ఖాతాల్లో నగదు నేరుగా జమ చేస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 260కి పైగా అన్న క్యాంటీన్ల ద్వారా రూ.15కే నాణ్యమైన భోజనం అందిస్తున్నామని చెప్పారు.

**మెగా డీఎస్సీపై విమర్శించే నైతిక హక్కు ప్రతిపక్షాలకు లేదు**

యువగళం పాదయాత్రలో యువనేత నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ నిర్వహించి 16 వేల మంది యువతకు ఉద్యోగాలు కల్పించామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో డీఎస్సీ నిర్వహించకుండా నిరుద్యోగులను నిరాశపరిచిన వారే ఇప్పుడు మెగా డీఎస్సీపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. నిన్న నెల్లూరులో డీఎస్సీలో అక్రమాలంటూ ర్యాలీలు నిర్వహించే ముందు గత ఐదేళ్లలో ఎందుకు ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. 16 వేల కుటుంబాలు బాగుపడటం కూడా ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోవడం దురదృష్టకరమన్నారు.

**రామచంద్రాపురంలో రూ.2.18 కోట్ల అభివృద్ధి పనులు**

కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధికి రామచంద్రాపురమే నిదర్శనమని ఎమ్మెల్యే అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్క రోడ్డు కూడా వేయలేదని, తమ ప్రభుత్వం వచ్చాక రూ.2 కోట్ల 18 లక్షల 52 వేల వ్యయంతో అభివృద్ధి, సంక్షేమ పనులు చేపట్టామని తెలిపారు. మున్సిపల్ శాఖ ద్వారా రూ.62.47 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు నిర్మించామని చెప్పారు. ఇంకా అవసరమైన ప్రాంతాల్లో కూడా రోడ్ల నిర్మాణం త్వరలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. విద్యుత్ శాఖ ద్వారా రూ.1.38 కోట్ల పనులు చేపట్టామని తెలిపారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కింద 98 ఇళ్లకు ఉచిత సోలార్ రూఫ్‌టాప్ కనెక్షన్లు, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు, 150 విద్యుత్ స్తంభాల ఏర్పాటు చేపట్టినట్లు వెల్లడించారు. సీఎస్ఆర్ కింద వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా రూ.15.04 లక్షల వ్యయంతో తాగునీటి కనెక్షన్లు కల్పించామని చెప్పారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మూడు పేద కుటుంబాలకు రూ.2.51 లక్షల ఆర్థిక సాయం అందించామని పేర్కొన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలో మొత్తం 20 వార్డులు ఉన్నాయని, ఒక్క 20వ వార్డులోనే ఈ స్థాయి అభివృద్ధి జరిగిందంటే మన ప్రభుత్వ పాలన ఎలాంటిదో ప్రజలు గుర్తించాలన్నారు.

**పాఠశాల అభివృద్ధికి హామీ**

ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దత్తత తీసుకున్న ఈ గ్రామంలో మిగిలిన సమస్యలను కూడా ప్రాధాన్య క్రమంలో పరిష్కరిస్తామని ప్రశాంతి రెడ్డి హామీ ఇచ్చారు. అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనాన్ని పూర్తి చేయడంతో పాటు, పాఠశాలకు ఎదురుగా ఉన్న స్థలాన్ని సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేసి విద్యార్థులకు ఆటస్థలంగా అందిస్తామని చెప్పారు. వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా పాఠశాలలో సురక్షిత తాగునీటి కోసం వాటర్ ప్లాంట్ కూడా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

**399 ఖాళీ ఇళ్లపై విచారణ**

స్థానికులు కొత్త ఇళ్ల కోసం విజ్ఞప్తి చేసిన నేపథ్యంలో గత ప్రభుత్వం జగనన్న కాలనీలో నిర్మించిన 400 ఇళ్లలో ప్రస్తుతం కేవలం ఒక ఇంటిలో మాత్రమే నివాసం ఉంటుండగా, మిగిలిన 399 ఇళ్లు ఖాళీగా ఉన్నాయని ఎమ్మెల్యే గారు చెప్పారు. గత ప్రభుత్వంలో నిజంగా అర్హులకే ఇళ్లు కేటాయించి ఉంటే ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. దీనిపై విచారించాలని కమిషనర్, ఎమ్మార్వోలకు ఆదేశించినట్లు తెలిపారు. విచారణ అనంతరం ఖాళీగా ఉన్న ఇళ్లను అర్హులైన పేదలకు అందించే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**రూ.14 కోట్లతో బాంబే-బుచ్చి రహదారి అభివృద్ధి**

బాంబే-బుచ్చి రహదారిలో మౌలిక వసతుల అభివృద్ధికి రూ.14 కోట్లతో త్వరలో టెండర్లు ఆహ్వానించనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ అంశంపై నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఢిల్లీలో నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా చైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్‌ను కలిసి చర్చించగా సానుకూల స్పందన లభించిందన్నారు. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని తెలిపారు.

# ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

**కరప, (రాజధాని వార్తలు):** కాకినాడ రూరల్ మండల కేంద్రం కరప స్థానిక పల్లపు వీధి లోని శ్రీ గంటాలమ్మ-శ్రీ సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి (వ్యాసపూర్ణిమ) సందర్భంగా బుధవారం ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధ లతో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సం దర్భంగా శ్రీ గంటాలమ్మ అమ్మవారిని శాకంబరీ దేవి అలంకరణలో సర్వాంగ సుందరంగా అలం కరించగా, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మ వారి దివ్య దర్శనం చేసుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఉదయం కాకడ హారతితో కార్యక్ర మాలు ప్రారంభమయ్యాయి. అనంతరం శ్రీ గంటా లమ్మ అమ్మవారికి విశేష పూజలు, అర్చనలు నిర్వహించగా, శ్రీ సాయిబాబా వారికి అభిషేకం, అర్చనలు, ప్రత్యేక సేవలు నిర్వహించారు. గురు పౌర్ణమి సందర్భంగా వేదపండితులు పేరి పరమే శ్వరశర్మ-కనకదుర్గ దంపతులకు గురుపూజోత్స వాన్ని ఆలయ నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీ సాయిబాబా వారికి మహా మంగళహారతి సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా విరవకు చెందిన విజయదుర్గా మహిళా భజన మండలి సభ్యులు భక్తి గీతాలతో భజన కార్యక్రమం నిర్వహించారు.

వేములవాడకు చెందిన భక్తులు కోలాటాల నడుమ శ్రీ సాయిబాబా పల్లకీ సేవను నిర్వహించగా, భక్తులు భక్తిపారవశ్యంతో పాల్గొన్నారు. అనంతరం కాకినాడకు చెందిన శ్రీ జననీ నృత్య నికేతన్ కళాకారులు ప్రదర్శించిన భరతనాట్యం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సం దర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మాట్లాడుతూ గురుపౌర్ణమి వేడుకలకు అధిక సంఖ్యలో భక్తులు హాజరై సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొని, శ్రీ గంటాలమ్మ అమ్మవారు, శ్రీ సాయిబాబా వారి దివ్య ఆశీస్సులు పొందారని తెలిపారు. అనంతరం అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, మహిళలు, యువకులు, వివిధ గ్రామాల నుంచి విచ్చేసిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సంపాదకీయం

## ప్రతిఘటనతోనే ప్రజాస్వామ్యం పునరుద్ధరణ

రాజ్యాంగబద్ధ ప్రజాస్వామిక సమాజంలో వీధి నిరసన న్యాయసమ్మతమేనా? ఎన్నికలలో పోటీ చేయడానికే ప్రాధాన్యమివ్వడం కాకుండా శాంతియుత, ప్రజాస్వామిక ప్రతిఘటనే ప్రతిపక్షాల పురోగతికి సరైన మార్గమని నేను ఇదే కాలమ్‌లో చేసిన వాదనకు ప్రతిస్పందనగా పలువురు నాకు ఆ ప్రశ్న వేశారు. భారతీయ జనతా పార్టీ ఐటీ సెల్ చీఫ్, దర్బారీ మీడియా యాంకర్-ఇన్-చీఫ్, అధికార పార్టీని సమర్థించే విద్యావేత్తలు నా వాదనపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. ఆ వాదన ప్రజాస్వామ్య వ్యతిరేకమని, రాజ్యాంగ విరుద్ధమని, జాతి-వ్యతిరేకమని తప్పుపట్టారు. అసాధారణంగా జరిగిన యువజనుల నిరసన పాలక పార్టీ వర్గాలకు కలిగించిన నిరుత్సాహం నుంచే ఆ విమర్శలు వచ్చాయనేది స్పష్టం. ప్రజల్లో ప్రగాఢంగా ఉన్న భయసంకోచాలకు తెరదించిన అపూర్వ ప్రజానిరసన అది. నా వాదనపై వచ్చిన విమర్శల్లో నిజాయితీ లోపించింది. విమర్శకులు చాలా తెలివిగా, తమకు అనుకూలంగా నా వాదనలోని ‘శాంతియుత, ప్రజాస్వామిక’ అనే పదబంధాన్ని విస్మరించారు. ప్రజల్లో విభేదాలు సృష్టించి, మత సామరస్యాన్ని దెబ్బతీసిన రథయాత్రతో అధికారానికి వచ్చినవారు, న్యాయ, రాజ్యాంగ నియమాలను ఉల్లంఘించినవారు వ్యవస్థలను గౌరవించడం గురించి ఉపన్యాసాలు ఇవ్వడం ప్రారంభించారు. రిజర్వేషన్లను వ్యతిరేకించినవారు, సామాజిక న్యాయ భావననే అంగీకరించనివారు స్వతంత్ర భారతదేశంలో పౌర శాసనోల్లంఘనకు వ్యతిరేకంగా అంబేడ్కర్ చేసిన వాదనలను ఉటంకిస్తున్నారు. వాళ్ల విమర్శలు ఇలా ఉన్నాయి: ఒక ప్రజాస్వామిక వ్యవస్థలో ఒక సమస్యను, ఎన్నికైన ప్రజాప్రతినిధులను విస్మరించి, రాజ్యాంగ సంస్థలను ఉపేక్షించి, వీధి నిరసన ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లేందుకు ప్రజలను సమీకరించడం సమర్థనీయమేనా? సమస్యలు, వివాదాలను పరిష్కరించుకునేందుకు రాజ్యాంగ సంస్థలను గౌరవించవలసిన అవసరం లేదా? వీధి నిరసనలు అంటే మూకస్వామ్యాన్ని స్వాగతించడం కాదా? మూకస్వామ్యం ప్రబలమయితే నిర్ణయాలు సహేతుకంగా తీసుకోవడం ఎలా సాధ్యమవుతుంది? మూకస్వామ్యం అరాచకానికి దారితీసి రాజ్యాంగబద్ధ పాలనను అసాధ్యం చేయదా? ఇది సమాజంలోని అణగారిన వర్గాల శ్రేయస్సుకు ఎలా దోహదం చేస్తుంది? ఈ ప్రశ్నలు నిరపాయకరమైనవిగా కనిపిస్తున్నాయి. అయితే వాటిలో లోపాలు ఉన్నాయి. రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యంలో సంస్థలు సక్రమంగా పనిచేస్తాయనే సునిశ్చిత విశ్వాసంతోనే ఆ ప్రశ్నలు వేయడం జరిగింది. రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యంలో సంస్థలు, వ్యవస్థలు సక్రమంగా ఉంటాయనేది ఒక మిథ్య. సమీకృతమైన ప్రజలు ఉన్మాద హంతక మూకలు కారు. ఒక ఉమ్మడి లక్ష్యంతో అనియతంగా సమావేశమైన జన బాహుళ్యమది. అలిఖిత నైతిక నియమావళి వారి ప్రవర్తనను నిర్దేశిస్తుంది. దీనిని మరింత వివరంగా చూద్దాం. ఆధునిక ప్రజాస్వామ్యాలు ప్రారంభంకాక ముందు లేదా వాటి తొలిదశలో ప్రజా సమూహాలు అందరికీ ఆమోదయోగ్యమైన, అప్పటికే సంప్రదాయపరంగా ఉన్న హక్కులను, పద్ధతులను అనుసరించేవని చరిత్రకారులు వివరించారు. 18వ శతాబ్దిలో ఇంగ్లాండ్‌లోని పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా అప్పటి ప్రజలు లాభాపేక్షలేని ‘నైతిక ఆర్థిక వ్యవస్థ’ను (మోరల్ ఎకానమీ) కోరుకున్నారని ఈపీ థాంప్సన్ వివరించారు. సమష్టి శ్రేయస్సుకు భంగం కలగని రీతిలో ప్రజలు తమ ఆర్థిక, సామాజిక జీవితంలో వ్యవహరించేవారని ఆయన పేర్కొన్నారు. కాబట్టి, పాలనలో ప్రజల భాగస్వామ్యం అన్న భావనను ఉదారవాద ప్రజాస్వామ్యం కొత్తగా ఆవిష్కరించలేదు. సుదీర్ఘకాలంగా ఆచరణలో ఉన్న అసెంబ్లీలు, పిటిషన్లు, ప్రజాసమూహాల ఉమ్మడి నిరసన మొదలైన పద్ధతులను ఆధునిక ప్రజాస్వామ్యాలే వ్యవస్థీకృతం చేశాయి. అందువల్ల, ప్రజాప్రతిఘటన లేదా ‘కలహశీల రాజకీయాల’ను ఆధునిక ప్రజాస్వామ్యాలు రూపుమాపలేవు. ప్రజాస్వామ్యం పనిచేసే తీరుతెన్నులలో అవి అంతర్భాగాలు. జవాబుదారీతనంతో కూడిన క్రమబద్ధమైన ప్రజాస్వామిక ఆచరణతో పాటు క్రమపద్ధతిలో లేని సామాన్య ప్రజల ఉమ్మడి కార్యాచరణ కూడా పనిచేసే ప్రజాస్వామ్య సజీవ లక్షణం. నిరసన ప్రదర్శనలు, సమ్మెలు, ధర్నాలు, బాయ్‌కాట్‌లు, శాసనోల్లంఘన మొదలైన అనియత పద్ధతుల రూపేణా తమ డిమాండ్లను ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లేందుకు సామాన్య పౌరులు ప్రయత్నిస్తుంటారు. ప్రజా ఉద్యమాలు ప్రజాస్వామిక వైఫల్యానికి చిహ్నాలు కావని పశ్చిమ యూరోప్‌లో గత అయిదు శతాబ్దాల కాలంలో సామాన్య ప్రజల ఉమ్మడి కార్యాచరణను నిశితంగా అధ్యయనం చేసిన చార్లెస్ టిల్లీ అనే చరిత్రకారుడు అభిప్రాయపడ్డారు. ప్రజాఉద్యమాలు వాస్తవానికి ప్రజాస్వామిక పాలన పరిణామ క్రమంలో ఉద్భవించినవేనని ఆయన అన్నారు. అవి వ్యవస్థ పట్ల శత్రుపూర్వకమైనవి కావు. ప్రజా నిరసనలు తరచూ వ్యవస్థాగత సంస్కరణలకు దారితీస్తాయి. వ్యవస్థల సానుకూల ప్రతిస్పందన ప్రజలు మరింతగా సంఘటితమయ్యేందుకు ఉద్దీపన అవుతుందని చార్లెస్ టిల్లీ నిర్ధారించారు. గ్లోబల్ సౌత్ (ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా) ప్రజాస్వామిక వ్యవస్థల్లో ప్రజాసమీకరణల ప్రత్యేక పాత్రను గుర్తించడం చాలా ముఖ్యం. 20వ శతాబ్దంలో వలసపాలన నుంచి విముక్తమైన చాలా దేశాలు ఉదారవాద ప్రజాస్వామ్యాన్ని అనుసరించాయి. అయితే చాలా దేశాలలో ఆ పాలనా పద్ధతులు ప్రభావశీలంగా అమలయేందుకు అవసరమైన సంస్థాగత ప్రాతిపదికలు బలహీనమైనవి. భారత్ లాంటి ప్రజాస్వామిక సమాజంలో ప్రజా ఉద్యమాలు, నిరసనలు సంస్థాగత లోపాలు, లొసుగులను అధిగమించేందుకు దోహదం చేస్తున్నాయి.

# సాగునీరు విడుదలపై రైతుల హర్షం



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** గత కొంతకాలంగా ఏలేరు ప్రాజెక్టు నుంచి సాగునీరు అందక జగ్గంపేట, పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో రైతుల సమస్యను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం శాసనసభ్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. రైతుల ఆవేదనను వెంటనే గుర్తించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇరిగేషన్ శాఖ అధికారులు, ఏలేరు నీటి వినియోగదారుల సంఘం ప్రతినిధులు, జిల్లా అధికారులతో మాట్లాడి, కాకినాడ జిల్లా కలెక్టర్ సహకారంతో ఏలేరు ప్రాజెక్టు నుంచి 1,000 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేయించేలా ప్రత్యేక చొరవ చూపారు. దీంతో జగ్గంపేట, పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల్లోని వేలాది ఎకరాలకు సాగునీరు అందే పరిస్థితి ఏర్పడటంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఎన్నో రోజులుగా సాగునీటి కోసం ఎదురుచూస్తున్న రైతులకు ఈ నిర్ణయం గొప్ప ఊరటనిచ్చిందని పేర్కొంటూ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా పెద్దాపురం నియోజకవర్గం, పెద్దాపురం మండలం దివిలి గ్రామం వద్ద ఏలేరు కాలువలో ప్రవహిస్తున్న సాగునీటి వద్ద ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. రైతుల చేతుల మీదుగా, కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు చేతుల మీదుగా, రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి తమ కృతజ్ఞతలను ఘనంగా తెలియజేశారు. ఈ సందర్భంగా తుమ్మల బాబు మాట్లాడుతూ రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతుల సమస్య తెలిసిన వెంటనే స్పందించి సాగునీటి విడుదలకు చర్యలు తీసుకున్న ఉప ముఖ్య మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ చొరవ అభినందనీయమన్నారు. ఎన్నో రోజులుగా సాగునీటి కోసం ఎదురు చూస్తున్న రైతుల ముఖాల్లో చిరునవ్వులు తీసుకురావడంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం కీలకమని పేర్కొన్నారు. రైతులకు అవసరమైన ప్రతి అంశంలో ప్రభుత్వం అండగా నిలుస్తుందని, భవిష్యత్తులో కూడా వ్యవసాయానికి అవసరమైన సాగునీరు నిరంతరాయంగా అందేలా చర్యలు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు నీటి సంఘం వైస్ ఉపాధ్యక్షులు జట్ల విజయ్ బాబు, మండల యువత అధ్యక్షులు వెన్న వెంకటేష్, నీటి సంఘం ప్రెసిడెంట్ మొయిల్లా పెద్దవెంకన్న, జట్ల రాంబాబు, కంటి బోయిన ప్రసాద్, నుకలమంతి నాగు, ద్వారంపూడి చల్లారావు, గోపు వల్లయా, కురుమెల్ల దివనం, బండి రఘు బాబు, పాలిశెట్టి రాజు, నుకలమంతి నానాజీ, ఎలిశెట్టి నాగు, రాగాలంజి, వల్లభశెట్టి రాంబాబు, జాజుల నాగబాబు, వంగలపూడి దుర్గజి, సలిపల్లి నాగభూషణం, కూటమి ప్రజాప్రతినిధులు, దివిలి, చంద్రమాంపల్లి, తాటిపర్తి రైతు సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# మహిళా ఆర్థిక స్వావలంబానకు బృహత్తర ప్రణాళిక...!

## - వెదురు పెంపకం ప్రారంభంలో జిల్లా కలెక్టర్





**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సమాజంలో మహిళల ఆర్థిక స్వలంబనే లక్ష్యంగా మహిళల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలను చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ హారేంద్ర ప్రసాద్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యసాధన కోసం మహిళలను పారిశ్రామికవేత్తలుగా అభివృద్ధి చేసేందుకు కాకినాడ జిల్లాలో నిరంతరం కృషి చేస్తున్నట్లు ఆయన చెప్పారు. సామర్లకోట టిటిడిసిలో మహిళల కోసం చేపట్టిన వివిధ పథకాలను పర్యవేక్షణలో భాగంగా కలెక్టర్ హరీంద్ర ప్రసాద్ వెదురు మొక్కల పెంపకం కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల స్వయం ఉపాధి, పారిశ్రామిక వ్యాపార కల్పన కోసం కుట్టు శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేయగా, పెద్ద ఎత్తున మహిళలు శిక్షణ ఉపాధి పొందుతున్నట్లు తెలిపారు. వెదురు మొక్కల పెంపకం ద్వారా నాలుగు సంవత్సరాల నుండి 40 సంవత్సరాల వరకు భారీ ఆదాయం మహిళలు సాధించాలన్న లక్ష్యంతో వెదురు సాగు పైలెట్ ప్రాజెక్టు ప్లాంటేషన్ చేపట్టినట్లు కలెక్టర్ వివరించారు. వెదురుతో వెయ్యి లాభాలు పొందవచ్చునన్న సత్యాన్ని ఈ ప్రాజెక్టు నిరూపిస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలో వెయ్యిమందిని మహిళా రైతులుగా తీర్చిదిద్దనుండగా ఇప్పటి వరకు 760 మందిని సిద్ధం చేసామన్నారు. ప్రధానంగా ఈ వెదురు సాగుకు పైలెట్ మండలాలుగా మెట్ట ప్రాంతాలు అయిన జగ్గంపేట, గండేపల్లి, ప్రత్తిపాడు, రౌతులపూడి, శంఖవరం మండలాలను ఎంపిక చేసినట్టు కలెక్టర్ చెప్పారు. అక్కడ వెదురు సాగు ప్రగతిని బట్టి మిగిలిన మండలాల్లో అమలు చెయ్యనున్నట్టు ఆయన చెప్పారు. ఇంకా విత్తసఖీ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు వివిధ సేవలను అందించేందుకు వీలుగా ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేసేందుకు రాష్ట్రంలో 5 లక్షల మంది మహిళా పారిశ్రామిక వేత్తలను తయారు చేయాలన్న లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి ఉండగా జిల్లాలో 30 వేల మంది మహిళా పారిశ్రామికవేత్తలు తయారీ లక్ష్యంగా కలిగినట్టు చెప్పారు.

దానికనుగుణంగా డిఆర్డిఏ ఆధ్వర్యంలో ఇప్పటికే విత్తసఖి శిక్షణా కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ఈ శిక్షణ ద్వారా మహిళా పారిశ్రామిక వేత్తల తయారీకి, ప్రాజెక్టుల రూపకల్పనకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తాయని కలెక్టర్ వివరించారు. ముందుగా టిటిడిసిలో వేదురు ప్లాంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించి, మహిళలకు అందిస్తున్న కుట్టు శిక్షణ, చేపల పెంపకం పథకాలను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం విత్తసఖి శిక్షణా కార్యక్రమాన్ని సందర్శించి, మహిళలకు ఆయన దిశ నిర్దేశం చేశారు. అలాగే స్థానిక టిటిడిసికి పూర్వ వైభవం తీసుకు వచ్చే దిశగా కొద్ది నెలల్లోనే ప్రత్యేక ప్రణాళికలు రూపొందించనున్నట్టు కలెక్టర్ వెల్లడించారు. దీని కేంద్రంగా మహిళల జీవనోపాది కార్యక్రమాలు మెరుగు పరచనున్నట్టు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి శ్రీనివాస్ ఎపిడి జిలాని, డిపిఎంలు విబిఆర్ రాయ్, టి బాబురావు, భరత్, ఎపిఎం అనిల్ కుమార్, సఖినా ప్రియ దర్శిని, దుర్గాప్రసాద్, డిఆర్డిఎ, సెర్ప్ సిబ్బంది పాల్గొన్నారు.

# రూ. కోటి వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభం



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామంలో రూ.1 కోటి వ్యయంతో నిర్మించిన నూతన సీసీ రోడ్డును పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు)లు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు వారికి ఘన స్వాగతం పలికి, గ్రామ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న “ఇంటింటికి కూటమి ప్రభుత్వం” కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్తులో చేపట్టనున్న ప్రజాహిత కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని వారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బిసి కార్పొరేషన్ చైర్మన్ కుడిపూడి సత్తిబాబు, తెదేపా జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాగ్, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, మాజీ జెడ్పిటిసి గుమ్మళ్ళ విజయలక్ష్మి రామకృష్ణ పాల్గొని కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేస్తూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిపై వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథులు మాట్లాడుతూ, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర అభివృద్ధి పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన నిలిచి పోయిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామీణాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ సీసీ రోడ్లు, తాగునీటి సదుపాయాలు, సాగునీటి వసతులు, పారిశుద్ధ్య పనులు తదితర అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. రైతులకు సాగునీరు అందుబాటులోకి రావడంతో పంట పొలాలు సస్యశ్యామలంగా మారుతున్నాయని, రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి గ్రామంలో అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ప్రజల అభివృద్ధి కంటే కేవలం బటన్ నొక్కే కార్యక్రమాలకే పరిమితమైందని వారు విమర్శించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం పారదర్శక పాలన అందిస్తూ సంక్షేమం, అభివృద్ధి రెండింటికీ సమాన ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చేరేలా సమర్థవంతమైన పాలన కొనసాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బడుగు శ్రీకాంత్, బలుసు వాసు, కంటే జగదీశ్ మోహన్, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు అందుగుల మాణికుమారి, జార్జి చక్రవర్తి, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, అధిక సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

# మరిడమ్మ అమ్మవారికి శాకాంబరి అలంకారం



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** దేశవ్యాప్తంగా ప్రసిద్ధికెక్కిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. దానిలో భాగంగా బుధవారం గురు పౌర్ణమి సందర్భంగా అమ్మవారిని దేవస్థానం అధికారులు, వేద పండితులు, ఆశాధులు శాకాంబరి మాతగా ప్రత్యేక రీతిలో ఆకర్షణీయంగా అలంకరించారు. అమ్మవారితో పాటు దేవాలయ ప్రాంగణాలన్నీ వివిధ రకాల కూరగాయలు, పండ్లతో అందంగా తీర్చిదిద్దారు. అలాగే అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు అమ్మవారి దర్శనం కోసం క్యూ కట్టారు. దేవస్థానం, అధికారిణి, సహాయ కమిషనర్ కె విజయలక్ష్మి పర్యవేక్షణలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.

# గురు పౌర్ణమి రోజున శ్రీ కాశీ వారాహి అమ్మవారి నగల అలంకరణ



**కరప, (రాజధాని వార్తలు):** గురు పౌర్ణమి సందర్భంగా కాకినాడ రూరల్ మండలం కరప-కొరుపల్లి పరిధిలో కాకినాడ-రామచంద్రపురం ప్రధాన రహదారిపై ఉన్న శ్రీ కాశీ వారాహి మాత ఆలయంలో బుధవారం ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలిసారిగా అమ్మవారిని వెండి కిరీటం, ఎనిమిది హస్తాలు నగల అలంకరణతో అత్యంత సుందరంగా అలంకరించగా, ఆ దివ్యరూపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. చేరుకూరి సుబ్బన్న, అగస్త్యుల ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛారణల నడుమ వివాహ యోగం కోసం అవివాహిత యువతీ యువకులకు ప్రత్యేక అనుగ్రహ పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం వారికి పవిత్ర కంకణాలు కట్టి అమ్మవారి ఆశీర్వాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త చిక్కాల దొరబాబు మాట్లాడుతూ గురు పౌర్ణమి సందర్భంగా శ్రీ కాశీ వారాహి మాతకు తొలిసారిగా నగల అలంకరణ నిర్వహించడం ఎంతో విశేషమని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకుంటున్నారని చెప్పారు. ప్రతి పౌర్ణమి రోజున వివాహం కాని యువతీ యువకులకు ప్రత్యేక పూజలు నిర్వహించడం ఈ ఆలయ ప్రత్యేకత అని ఆయన పేర్కొన్నారు. అలాగే మత సామరస్యానికి ప్రతీకగా ముస్లిం యువకులు కూడా ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించడం ఆనందదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# భీమేశ్వరునికి కెనడా భక్తురాలు వెండి మారేడు దళహారం విరాళం



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట భీమేశ్వర స్వామి దేవస్థానానికి కెనడా వాస్తవ్యురాలు హేమలత దేవి బుధవారం భక్తిశ్రద్ధలతో 1 కిలో 40 గ్రాముల వెండితో తయారు చేసిన మారేడు దళముల హారాన్ని విరాళంగా అందజేశారు. ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ఈ హారాన్ని దేవస్థాన ఈవో బళ్ల నీలకంఠం సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు భీమేశ్వర స్వామివారి తీర్థప్రసాదాలతో పాటు స్వామివారి చిత్రపటాన్ని హేమలత దేవికి అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో దేవస్థాన అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ విషయాన్ని దేవస్థానం కార్యనిర్వహణాధికారి బళ్ల నీలకంఠం (శివ), చైర్మన్ కంటే జగదీష్ మోహనరావు (బాబు) మరియు ధర్మకర్తల మండలి సభ్యులు వెల్లడించారు.

# టైమ్ సెన్స్‌లో సౌత్‌కు మార్కులేసిన కాజల్



ఇండియన్ సినీ ఇండస్ట్రీలో భాషల మధ్య పోటీ ఎంత పెరుగుతుందో, వర్క్ కల్చర్ మరియు కథల ఎంపికలపై డిస్కషన్ కూడా అంతే వేగంగా ముందుకు సాగుతోంది. ముఖ్యంగా సౌత్ సినీ ఇండస్ట్రీలో సమయపాలన, ప్రొఫెషనల్ వాతావరణం, హీరోయిన్ల క్యారెక్టర్ రైటింగ్‌లో కనిపిస్తున్న మార్పులు ఇప్పుడు జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారుతున్నాయి. ప్రముఖ నటి కాజల్ అగర్వాల్ తాజా కామెంట్స్ ఈ రెండు అంశాలను మరోసారి హైలైట్ చేశాయి. సినీ నిర్మాణంలో టైమ్ అనేది ఎంతో కీలకమైనది. ఒక షూటింగ్ షెడ్యూల్ ఆలస్యమైతే దాని ఎఫెక్ట్ నటీనటుల డేట్స్ నుంచి టెక్నికల్ టీమ్ వర్క్ అవర్స్ వరకు విస్తరిస్తుంది. ఈ నేపథ్యంలో సౌత్ ఇండస్ట్రీలో షెడ్యూల్‌కు కట్టుబడి పనిచేసే విధానం, బాలీవుడ్‌లో తరచుగా కనిపించే ఆలస్యాల సంస్కృతి మధ్య తేడాపై కాజల్ చేసిన కామెంట్స్ ప్రొడక్షన్ ఎఫిషియెన్సీపై కొత్త డిస్కషన్‌కు దారి తీశాయి. టైమ్ సెన్స్ అనేది కేవలం వ్యక్తిగత అలవాటుగా కాకుండా, మొత్తం సినిమా నిర్మాణ వ్యవస్థ సామర్థ్యాన్ని డిసైడ్ చేసే అంశంగా ఇండస్ట్రీ వర్గాలు భావిస్తాయి. అయితే ఆమె కామెంట్స్ కేవలం వర్క్ కల్చర్‌కే పరిమితం కాలేదు. కెరీర్ ఎంపికల విషయంలో కూడా ఎన్ని సినిమాలు చేశామనే నెంబర్ కంటే క్వాలిటీకే ప్రాధాన్యం ఇచ్చానని చెప్పడం గమనార్హం. సౌత్‌లో తనకు వచ్చిన క్యారెక్టర్లు నటిగా సంతృప్తినిచ్చాయని, అందుకే సాధారణ పాత్రల కంటే స్ట్రాంగ్ స్టోరీలను సెలెక్ట్ చేసుకున్నాననే భావన ఆమె మాటల్లో కనిపించింది. పైగా గత కొన్నేళ్లుగా సౌత్ సినిమాల్లో మహిళా పాత్రల రచనలో గణనీయమైన మార్పు కనిపిస్తోంది. ఒకప్పుడు హీరో చుట్టూ తిరిగే పాత్రలకే పరిమితమైన కథనాల్లో ఇప్పుడు హీరోయిన్లకు స్వతంత్ర ప్రయాణం, ఎమోషనల్ స్ట్రెంగ్త్ వంటి అంశాలు చోటు చేసుకుంటున్నాయి. ఫ్యామిలీ స్టోరీస్, థ్రిల్లర్లు, పీరియాడిక్ డ్రామాలు, యాక్షన్ సినిమాలు అన్న తేడా లేకుండా హీరోయిన్ క్యారెక్టర్లు కథను ముందుకు నడిపించే స్థాయికి చేరుకుంటున్నాయి. ఈ పరిణామం ప్రేక్షకుల అభిరుచిలో వచ్చిన మార్పుకు కూడా ప్రతిబింబంగా కనిపిస్తోంది. కేవలం గ్లామర్ కోసం కాకుండా, కథలో బలమైన స్థానం ఉన్న పాత్రల కోసం హీరోయిన్లు ఎదురు చూస్తున్న దశకు ఇండస్ట్రీ చేరుకుంటోందనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

సమయ పాలనతో కూడిన ప్రొఫెషనల్ వాతావరణం, కంటెంట్‌కు ప్రాధాన్యం ఇచ్చే కథలు, మహిళా పాత్రలకు పెరుగుతున్న ప్రాధాన్యం.. ఈ మూడు అంశాలే ఫ్యూచర్ ఇండియన్ సినిమా దిశను డిసైడ్ చేసే కీలక సూచికలుగా మారే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# పెద్ద హీరోలతో పోటీకి కిరణ్ రెడీ.. ధైర్యమా, రిస్కా?




కిరణ్ అబ్బవరం తన కెరీర్‌లో ఒకేసారి రెండు కీలక నిర్ణయాలు తీసుకున్నారనే చర్చ టాలీవుడ్‌లో వినిపిస్తోంది. కిరణ్ స్వీయ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. వాస్తవానికి ఆ సినిమా సెప్టెంబర్‌లో రిలీజవాల్సింది కానీ ఇప్పుడు దాన్ని సెప్టెంబర్ నుంచి సంక్రాంతి బరిలోకి తీసుకురావడం పెద్ద వ్యూహాత్మక రిస్క్‌గా కనిపిస్తోంది. సాధారణంగా పండగ సీజన్ అంటే స్టార్ హీరోల భారీ సినిమాల ఆధిపత్యం ఉంటుంది. అలాంటి టైమ్‌లో ఒక కామెడీ ఎంటర్‌టైనర్‌తో రంగంలోకి దిగడం కిరణ్ అబ్బవరం లెక్కలపై ఆసక్తిని పెంచుతోంది. ఇటీవలి కాలంలో యాక్షన్, పాన్ ఇండియా, మాస్ సినిమాల హవా ఎక్కువగా కనిపిస్తున్నప్పటికీ, పండగ సీజన్‌లో ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఆకట్టుకునే కామెడీ సినిమాలకు ఎప్పుడూ ప్రత్యేకమైన స్థానం ఉంటుంది. ముఖ్యంగా సంక్రాంతి సీజన్‌లో ఫ్యామిలీ ఆడియన్స్ థియేటర్లకు పెద్ద సంఖ్యలో వస్తారు. ఈ నేపథ్యంలో యాక్షన్ కాకుండా కామెడీ జానర్ కావడంతో ఆ సినిమాకు సంక్రాంతి సీజన్‌ను ఎంచుకోవడం కూడా ఆలోచించి తీసుకున్న డెసిషన్‌గానే సినీ వర్గాలు భావిస్తున్నాయి. అయితే అసలు రిస్క్ డైరెక్టర్‌గా మారడంలోనే ఉంది. నటుడిగా ఒక పాత్రకు బాధ్యత వహించడం వేరు, డైరెక్టర్‌గా మొత్తం సినిమాను మోయడం వేరు. కథ, స్క్రీన్‌ప్లే, కామెడీ టైమింగ్, ఎమోషనల్ బ్యాలెన్స్, నటీనటుల పనితీరు, సాంకేతిక విభాగాల సమన్వయం వంటి ప్రతి అంశంపై పూర్తి బాధ్యత డైరెక్టర్‌పైనే ఉంటుంది. అందుకే హీరో నుంచి డైరెక్టర్‌గా మారే ప్రయత్నాన్ని ఇండస్ట్రీలో ఎప్పుడూ సవాల్‌గా చూస్తారు. దీనికి తోడు రిలీజ్ టైమింగ్‌ను మార్చడం మరో కీలక నిర్ణయం. సెప్టెంబర్‌లో రిలీజయ్యే సినిమా సంక్రాంతికి వాయిదా పడితే పోటీ స్థాయి పూర్తిగా మారిపోతుంది. పెద్ద సినిమాలు, భారీ ప్రమోషన్లు, ఎక్కువ స్క్రీన్‌ల కోసం పోటీ వంటి అంశాలు సహజంగానే ప్రెజర్‌ను పెంచుతాయి. అయినప్పటికీ, సంక్రాంతి సీజన్‌లో సక్సెస్‌ను అందుకుంటే దాని ఇంపాక్ట్ కూడా అంతే భారీగా ఉంటుంది. సాధారణ సీజన్‌లో వచ్చే హిట్ కంటే పండగ సీజన్‌లో వచ్చే హిట్‌కు మార్కెట్ వాల్యూ ఎక్కువగా ఉంటుంది. ఇక్కడే రిస్క్‌కు తగిన రివార్డ్ అవకాశం కనిపిస్తోంది.

ఒకవేళ సినిమాలో మంచి కంటెంట్ ఉండి, కామెడీ ప్రేక్షకులను ఆకట్టుకుని, ఫ్యామిలీ ఆడియన్స్‌కు కనెక్ట్ అయితే సంక్రాంతి సీజన్‌లో భారీ కలెక్షన్లు సాధించే అవకాశాన్ని పూర్తిగా కొట్టిపారేయలేం. మౌత్ పబ్లిసిటీ బలంగా పనిచేస్తే పెద్ద సినిమాల మధ్య కూడా ఒక మంచి కామెడీ ఎంటర్‌టైనర్ తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకోవచ్చు. అందుకే కిరణ్ అబ్బవరం తీసుకున్న ఈ డెసిషన్ సాధారణ రిలీజ్ ఛేంజ్‌గా కాకుండా, డైరెక్టర్‌గా తనను తాను నిరూపించుకోవాలనే డేరింగ్ డెసిషన్‌గా సినీ విశ్లేషకులు చూస్తున్నారు. ఈ రిస్క్ చివరికి ఎంత పెద్ద రివార్డ్‌గా మారుతుందనేదే దానిపైనే ఇప్పుడు ఆసక్తి నెలకొంది.

# లైవ్‌లోనే లెహంగా డ్రాప్.. శోభిత స్టైల్‌కు ఆడియన్స్ ఫిదా!



ఇండియా కౌచర్ వీక్ 2026 వేడుకల్లో నటి శోభిత ధూళిపాళ తన గ్లామర్‌తో అందరి దృష్టినీ ఆకట్టుకుంది. ప్రముఖ డిజైనర్ రాహుల్ మిశ్రా డిజైన్ చేసిన 'దేవి' కలెక్షన్‌కు ఆమె షోస్టాపర్‌గా వ్యవహరించింది. సాధారణంగా ర్యాంప్‌పై నడవడమే చూస్తుంటాం, కానీ ఇక్కడ అందరూ చూస్తుండగానే లైవ్‌లోనే శోభితకు లెహంగా డ్రాపింగ్ చేయడం విశేషం. ఈ అద్భుతమైన ప్రదర్శన, ఆమె అభినయం చూసి ఆడియన్స్ ఒక్కసారిగా ఫిదా అయిపోయారు. ఆ విశేషాలు చూద్దాం..

**రాహుల్ మిశ్రా మ్యాజిక్: 'దేవి' కలెక్షన్:**

ఇటీవలే ప్యారిస్ హాట్ కౌచర్ వీక్‌లో ప్రదర్శించి ప్రశంసలు అందుకున్న 'దేవి' కలెక్షన్‌ను, రాహుల్ మిశ్రా ఈసారి భారతీయ సంస్కృతికి తగినట్లుగా ఢిల్లీ ర్యాంప్‌పైకి తీసుకొచ్చారు. ఇక స్త్రీత్వంలోని దైవత్వాన్ని ఆవిష్కరిస్తూ రూపుదిద్దిన ఈ దుస్తులు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. సంప్రదాయ కలలకు ఆధునిక టచ్ ఇస్తూ డిజైన్ చేసిన ఈ అవుట్‌ఫిట్స్ ఫ్యాషన్ ప్రియులను బాగా ఆకట్టుకున్నాయి.

**దేవతలా మెరిసి పోయిన శోభిత:**

ఈ షోలో శోభిత మొదట ఐవరీ, షాంపైన్ కలర్ కాంబినేషన్‌లో ఉన్న కౌచర్ డ్రెస్‌లో ఎంట్రీ ఇచ్చింది. ఇక సన్నని క్రిస్టల్ బీడ్స్ వర్క్‌తో తయారుచేసిన ఆ డ్రెస్ చూస్తే.. మెడలో అందమైన నగలే వేసుకున్నారా అన్నట్లుగా ఉంది. శోభిత రాచరికపు వెలుగుతో ర్యాంప్‌పై నడుస్తుంటే ప్రేక్షకులు కనురెప్ప వేయకుండా చూస్తూ ఉండిపోయారు.

**ర్యాంప్‌పైనే సర్ ప్రైజ్ చేసేశారు:**

ఆమె మొదటి వాక్ పూర్తయ్యాక అసలైన మ్యాజిక్ జరిగింది. ఇక శోభిత ర్యాంప్‌పై ఉండగానే కొందరు పర్ఫార్మర్స్ వచ్చి, ఆమె వేసుకున్న డ్రెస్‌పైనే ఎంతో గ్రాండ్‌గా ఉన్న లెహంగాను లైవ్‌లోనే తొడిగారు. అంతేకాదు, ఆ సమయంలోనే అదనపు ఆభరణాలను కూడా ఆమెకు తొడిగారు. దేవతకు అలంకారం చేస్తున్నట్లుగా..: పూర్వకాలంలో రాచరికంలో లేదా పూజా సమయాల్లో దేవికి అలంకరించినట్లుగా ఈ దృశ్యం అనిపించింది. ఇక కళ్ళముందే ఒక సాదాసీదా రూపం నుంచి పరిపూర్ణమైన దేవి రూపంలోకి శోభిత మారిపోవడం చూసి హాల్లో లోని వారందరూ చప్పట్లతో మార్మోగించారు. ఇక ఈ కాన్సెప్ట్ ఫ్యాషన్ షోకే ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఫ్యాషన్ షో అంటే కేవలం మోడల్స్ నడవడమే కాదని, అదొక గొప్ప కళ అని రాహుల్ మిశ్రా, శోభిత ధూళిపాళ కలిసి నిరూపించారు. ఇక సంప్రదాయ కళానైపుణ్యానికి, నాటకీయతను జోడించి చేసిన ఈ ప్రదర్శన ఇండియా కౌచర్ వీక్ 2026కే హైలైట్‌గా నిలిచిపోతుంది. శోభిత మేకప్, స్టైలింగ్, కాన్ఫిడెన్స్ ఫ్యాషన్ ప్రపంచంలో కొత్త ట్రెండ్‌ను క్రియేట్ చేశాయి.

# సినిమా అంటే ఇంకా భయమేనా?

## భాగ్యశ్రీ కామెంట్స్‌తో మొదలైన కొత్త డిస్కషన్



సినీ ఇండస్ట్రీలోకి రావాలనుకునే యూత్ సంఖ్య పెరుగుతున్నప్పటికీ, ఆ డెసిషన్‌ను కుటుంబాలు సులభంగా అంగీకరించక పోవడం ఇప్పటికీ చాలా చోట్ల కనిపిస్తోంది. ముఖ్యంగా తమ కూతుళ్లు యాక్టింగ్‌ను కెరీర్‌గా ఎంచుకోవాలనుకుంటే సేఫ్టీ, మంచి ఫ్యూచర్, సామాజిక ఒత్తిడి వంటి అంశాలు తల్లిదండ్రుల్లో ఆందోళనకు కారణమవుతున్నాయి. ఈ నేపథ్యాన్ని గుర్తు చేసేలా హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే రీసెంట్‌గా చేసిన కామెంట్స్ డిస్కషన్‌కు దారి తీశాయి. ఓ ఇంటరాక్షన్ లో భాగంగా భాగ్యశ్రీ తన కెరీర్ స్టార్టింగ్ స్టేజ్ లో ఎదుర్కొన్న ఫ్యామిలీ సిట్యుయేషన్స్‌ను ప్రస్తావించారు. సినిమాల్లోకి రావాలనే తన డెసిషన్‌కు ఇంట్లో ఎవరూ వెంటనే మద్దతివ్వలేదని, ముఖ్యంగా తన తల్లి తీవ్రంగా వ్యతిరేకించిందని చెప్పారు. ఆ టైమ్‌లో తల్లి తనతో మాట్లాడకపోవడమే కాకుండా వాట్సాప్‌లో కూడా బ్లాక్ చేసిందని ఆమె వెల్లడించారు. ఆ సిట్యుయేషన్ కొన్ని నెలల తరబడి కొనసాగిందని చెప్పడం, ఒక నటిగా ఎదిగే ప్రయాణంలో ఎదురైన వ్యక్తిగత సంఘర్షణను తెలియచేస్తోంది. ఇది కేవలం భాగ్యశ్రీ కథ మాత్రమే కాదు. ఇండియన్ ఫ్యామిలీస్‌లో సినీ ఇండస్ట్రీ గురించి ఉన్న అభిప్రాయలు ఇంకా పూర్తిగా మారలేదని పలువురు సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఎంటర్టైన్‌మెంట్ ఇండస్ట్రీలో అవకాశాలు ఎక్కువగా ఉన్నప్పటికీ, అది అనిశ్చితితో కూడుకున్న రంగమనే అభిప్రాయం చాలామంది తల్లిదండ్రుల్లో ఉంది. అందుకే మంచి ఉద్యోగాలు లేదా సాంప్రదాయ వృత్తుల వైపు తమ పిల్లలను ప్రోత్సహించే ధోరణి నేటికీ కొనసాగుతోంది.

సక్సెస్‌ఫుల్ సెలబ్రిటీల జీవితాల్లో కనిపించే గ్లామర్ వెనుక ఎన్నో కనిపించని పోరాటాలుంటాయని ఈ విషయం మరోసారి నిరూపించింది. సిల్వర్ స్క్రీన్‌పై కనిపించే చిరునవ్వు వెనుక ఒంటరితనం, ఫ్యామిలీతో విభేదాలు, రిజెక్షన్స్, అనిశ్చితి వంటి అనుభవాలు ఎన్నో దాగి ఉంటాయని అర్థమవుతోంది. భాగ్యశ్రీ చెప్పిన తన లైఫ్ ఎక్స్‌పీరియెన్స్ కూడా అదే విషయాన్ని గుర్తు చేస్తుంది. అయితే కొన్నాళ్ల తర్వాత ఫ్యామిలీ కూడా తనను అర్థం చేసుకుని, తాను చేసిన కృషిని గౌరవించిందనే సంకేతాలు ఆమె మాటల్లో కనిపించాయి. ఈ సంఘటన తల్లిదండ్రులు తప్పు చేశారనే విషయం కంటే, వారి భయాలు కూడా ఒక సామాజిక వాస్తవమేనని గుర్తు చేస్తుంది. అదే సమయంలో యూత్ తమ ఆశయాలను సాధించాలంటే టాలెంట్‌తో పాటు సహనం, మానసిక ధైర్యం, ఫ్యామిలీతో సంభాషించే సామర్థ్యం కూడా ఎంత ముఖ్యమో భాగ్యశ్రీ అనుభవం స్పష్టం చేస్తోంది.

# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు, అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలి

**- బూర్గం పహాడ్ తాసిల్దార్ కె ఆర్ కె వి ప్రసాద్ - రానున్న 36 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం - అన్ని శాఖల అధికారులు కార్యస్థానాల్లో అందుబాటులో ఉండాలి**



**బూర్గంపాడు, (రాజధాని వార్తలు):** రానున్న 36 గంటల్లో వాతావరణ శాఖ భారీ వర్షాల హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో బూర్గంపహడ్ మండలం ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని బూర్గంపహాడ్ తాసిల్దార్ కె ఆర్ కె వి ప్రసాద్ సూచించారు. భారీ వర్షాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భారీ వర్షాల హెచ్చరికల దృష్ట్యా అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉంటూ తమ కార్యస్థానాల్లో తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని బూర్గంపహడ్ మండల తాసిల్దార్ ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. వరద ముంపునకు గురయ్యే ప్రాంతాలను ముందుగానే గుర్తించి, అక్కడ నివసిస్తున్న ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భారీ వరద ప్రవాహం సమయంలో నదులు, వాగులు, కాలువలు, చెరువులు వంటి జలవనరుల వద్దకు వెళ్లకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, నీటి ప్రవాహాన్ని దాటేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించవద్దని సూచించారు. అలాగే రహదారులు, కల్వర్టులపై నీరు ప్రవహిస్తున్న ప్రాంతాల్లో ప్రజలు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. భారీ వర్షాల కారణంగా తాగునీరు కలుషితమయ్యే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని సురక్షిత తాగునీటి సరఫరాకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందించాలని కలెక్టర్ అన్నారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు తాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిన సందర్భాల్లో ఆసుపత్రుల్లో వైద్య సేవలకు ఆటంకం కలగకుండా అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని వైద్య, ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ప్రసవ సమయం సమీపించిన గర్భిణీలను ముందుగానే సమీప ఆసుపత్రులు లేదా గర్భిణీ వసతి కేంద్రాలకు తరలించి అవసరమైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మండలంలో ఉన్న అధికారులకు ఆదేశించారు.

# రేషన్ డీలర్ల సభ్యత్వ నమోదు కార్యక్రమం ఘన ప్రారంభం



**భద్రాచలం, (రాజధాని వార్తలు):** తెలంగాణ రాష్ట్ర ఆథరైజ్డ్ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రమేష్ బాబు, రాష్ట్ర కార్యవర్గం పిలుపు మేరకు చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు ఊకె శేఖర్ బుధవారం భద్రాచలం మండలంలో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా సభ్యత్వ నమోదును విస్తృతంగా చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. రేషన్ డీలర్ల సంక్షేమం, సంఘం బలోపేతమే లక్ష్యంగా ప్రతి రేషన్ డీలర్ సభ్యత్వం పొందాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా, డివిజన్, మండలాల ఆథరైజ్డ్ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం నాయకులు, రేషన్ డీలర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం డివిజన్ అధ్యక్షుడు భూక్యా సందీప్‌తో పాటు భూక్యా లక్ష్మణ్, జీ.రమేష్, ఎస్. రాంబాబు, వి.వీరయ్య, భూక్యా సాయి కౌశిక్, కె.రమాదేవి, పి.సరోజిని తదితరులు పాల్గొన్నారు.

# ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక శోభతో గురు పౌర్ణమి వేడుకలు

**- పాతిక వసంతాల విద్యాసేవలకు అరుదైన గౌరవం**



**విజయనగరం, (రాజధాని వార్తలు):**అజ్ఞానమనే అంధకారాన్ని పారద్రోలి, జ్ఞానమనే దివ్య జ్యోతిని వెలిగించే ప్రత్యక్ష దైవమైన గురువును స్మరించుకునే పరమ పవిత్రమైన పర్వదినం గురు పౌర్ణమి. ఈ పవిత్ర దినాన్ని పురస్కరించుకుని విజయనగరంలోని ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో గురు పౌర్ణమి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధల మధ్య, ఆధ్యాత్మిక శోభతో కన్నుల పండువగా జరిగాయి. స్థానిక కొత్త అగ్రహారంలో గల 'బ్లూమింగ్ మైండ్స్ ప్లే స్కూల్' ప్రాంగణంలో ఈ కార్యక్రమాన్ని క్లబ్ సభ్యులు ఘనంగా నిర్వహించారు. గురుభక్తిని, భారతీయ సనాతన సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఈ వేడుకలను తీర్చిదిద్దారు. సమాజ నిర్మాణంలో, భావితరాల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర అమోఘమైనది. ఈ మంగళకరమైన సందర్భాన్ని పురస్కరించుకుని, గడచిన 25 వసంతాలుగా విద్యారంగంలో నిరంతర సేవలందిస్తూ, ఎంతో మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పుతున్న ప్రముఖ విద్యావేత్త, 'ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ' విజయనగరం జిల్లా శాఖ మహిళా విభాగం అధ్యక్షురాలు సముద్రాల గిరిజా ప్రసన్నను ఇన్నర్ వీల్ క్లబ్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. పూలమాలలు, శాలువాతో ఆమెను సన్మానించి, విద్యారంగానికి ఆమె చేస్తున్న విశేషమైన, నిస్వార్థమైన కృషిని కొనియాడారు. ఈ సభకు అధ్యక్షత వహించిన ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు జి.కృష్ణవేణి ప్రసంగించారు. గురు పౌర్ణమి విశిష్టతను, వేద వ్యాసుల వారి ప్రాముఖ్యతను ఆమె సవివరంగా తెలియజేశారు. మానవ జీవితంలో గురువు స్థానం వెలకట్టలేనిదని, తల్లిదండ్రులు జన్మనిస్తే, ఆ జన్మకు సార్ధకతను చేకూర్చి సమాజంలో ఉన్నతమైన వ్యక్తిగా నిలబెట్టే బాధ్యత గురువుదేనని ఆమె వివరించారు. గురువుల పట్ల భక్తి ప్రపత్తులు కలిగి ఉండటమే మన సంస్కృతి అని ఆమె గుర్తు చేశారు. పూర్తి ఆధ్యాత్మిక వాతావరణంలో, గురుస్మరణతో సాగిన ఈ ఉత్సవంలో ఇన్నర్ వీల్ క్లబ్ క్రియాశీలక సభ్యురాళ్లు ఎం.గాయత్రి, ఎ.రజిత, ఎ.శ్రీదేవి, హెచ్.ఉమ లతో పాటు పలువురు క్లబ్ సభ్యులు, తదితరులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సమాజానికి విద్యాదానం చేస్తున్న ఒక ఉత్తమ ఉపాధ్యాయురాలిని ఈ పవిత్ర దినాన గుర్తించి, గౌరవించడం ద్వారా ఇన్నర్ వీల్ క్లబ్ సమాజానికి ఒక మంచి సందేశాన్ని అందించిందని పలువురు ప్రశంసించారు.



# శ్రీశ్రీ కళావేదిక జిల్లా కన్వీనర్‌గా సముద్రాల గురు ప్రసాద్

**విజయనగరం, (రాజధాని వార్తలు):** ఐఎస్ఓ గుర్తింపు పొందిన తొలి సాహిత్య సంస్థగా పేరుగాంచి 36 ప్రపంచ రికార్డులు సాధించిన శ్రీశ్రీ కళావేదికకు విజయనగరం జిల్లా కన్వీనర్‌గా సముద్రాల గురు ప్రసాద్ నియమితులయ్యారు. తెలుగు భాష పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేయడమే కాక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ తెలుగు భాషా విశిష్ట సేవా పురస్కార గ్రహీతగా గురు ప్రసాద్ గుర్తింపు పొందారు. నిరంతర సాహిత్య, సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలతో అంతర్జాతీయంగా ప్రధమ స్థానంలో నిలిచి తెలుగుభాషా సంస్కృతి పరిరక్షణలో భాగంగా నిరంతర కృషి సాగిస్తున్న శ్రీశ్రీ కళా వేదిక విజయనగరం జిల్లా కన్వీనర్‌గా గురు ప్రసాద్‌ను నియమించడం పట్ల పలువురు సాహితీవేత్తలు హర్షం వ్యక్తం చేశారు.

# ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు అనగాని, కొండపల్లి





**విజయనగరం, (భోగాపురం), (రాజధాని వార్తలు):** రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎంఎస్ఎంఈ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ బుధవారం విజయనగరం జిల్లా భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్ట్ నిర్మాణ పనులను, ప్రధాని నరేంద్ర మోదీ సభకు చేస్తున్న ఏర్పాట్లను ఇరువురూ క్షుణ్ణంగా పరిశీలించారు. టెర్మినల్ బిల్డింగ్‌తో పాటు బహిరంగ సభా వేదిక వద్ద చేస్తున్న ఏర్పాట్లను, హాజరయ్యేవారికి మౌలిక వసతుల పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.

పనులను మరింత వేగవంతం చేయాలని, బహిరంగ సభకు వచ్చేవారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా నాణ్యతా ప్రమాణాలతో అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ పర్యటనలో మంత్రుల వెంట పలువురు ముఖ్య నాయకులు, స్థానిక ప్రతినిధులు మరియు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పోలీస్ కుటుంబాల పిల్లల ప్రతిభకు ప్రోత్సాహం

**- తల్లిదండ్రులే పిల్లలకు తొలి రోల్ మోడల్స్ తిరుపతి జిల్లా ఎస్పీ**



**తిరుపతి, (రాజధాని వార్తలు):** జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ కుటుంబాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌ల కార్యక్రమంలో విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులకు అభినందన కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ఐపీఎస్, ముఖ్య అతిథిగా హాజరై మెరిట్ సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను అభినందించి,స్కాలర్‌షిప్‌లు మరియు అభినందన పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ విద్యా ర్థులు, వారి తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ పోలీస్ కుటుం బాల్లోని పిల్లలకు తల్లిదండ్రుల జీవన విధానమే తొలి పాఠశాల వంటిదని పేర్కొన్నారు. పోలీస్ ఉద్యోగులు విధి నిర్వహణలో చూపించే క్రమశిక్షణ, అంకితభావం, బాధ్యత, కష్టపడే తత్వాన్ని పిల్లలు చిన్నతనం నుంచే గమనిస్తుంటారని తెలిపారు. పిల్లలు తల్లిదండ్రుల నుంచి క్రమశిక్షణను నేర్చుకుని, సరైన మార్గదర్శకత్వంతో తమ లక్ష్యాల వైపు పయనిస్తే అద్భుతమైన విజయాలు సాధించగలరని ఎస్పీ తెలిపారు. విద్యార్థులు కేవలం చదువులోనే కాకుండా జీవితంలోనూ క్రమశిక్షణ, సమయపాలన, పట్టుదల, ఆత్మవిశ్వాసం వంటి లక్షణాలను అలవర్చుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థిలోనూ ప్రత్యేకమైన ప్రతిభ ఉంటుంది. ఆ ప్రతిభను గుర్తించి సరైన దిశలో ప్రోత్సహించడం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల బాధ్యత అని ఎస్పీ పేర్కొన్నారు. ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలు తమకంటే ఉన్నత స్థాయికి ఎదగాలని కోరుకుంటారని ఎస్పీ తెలిపారు. పిల్లలకు తల్లిదండ్రులే తొలి రోల్ మోడల్స్‌గా ఉండాలని తల్లిదండ్రుల ప్రవర్తన, క్రమశిక్షణ, విలువలు పిల్లల వ్యక్తిత్వంపై ఎంతో ప్రభావం చూపుతాయని తెలిపారు. పిల్లలపై అధిక ఒత్తిడి తీసుకురావడం కంటే వారి ఆసక్తి, సామర్థ్యం, ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ఎంతో ముఖ్యమని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు తమ సొంత ప్రతిభ, కృషి, పట్టుదలతోనే ఉన్నత స్థానాలకు చేరుకోవాలని పేర్కొన్నారు. పోలీస్ కుటుంబాల పిల్లల విజయాలు గర్వకారణం అని తెలిపారు. అనేక మంది విద్యార్థులు ప్రతి సంవత్సరం ఐఐటీ, జేఈఈ, ఎంబీబీఎస్, ఇంజనీరింగ్ వంటి ప్రతిష్ఠాత్మక విద్యారంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్నారని ఎస్పీ తెలిపారు. అంతేకాకుండా ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లి తమ ప్రతిభను చాటుతూ, వివిధ రంగాల్లో ఉన్నత స్థాయిలో ఉద్యోగాలు చేస్తూ పోలీస్ కుటుంబాలకు, పోలీస్ శాఖకు గర్వకారణంగా నిలుస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. పోలీస్ శాఖలో తల్లిదండ్రులు ప్రజల భద్రత కోసం విధులు నిర్వహిస్తుండగా, వారి పిల్లలు విద్యారంగంలో ప్రతిభ కనబరచడం ఎంతో సంతోషకరమైన విషయమని ఎస్పీ పేర్కొన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించేందుకు అందిస్తున్న మెరిట్ స్కాలర్‌షిప్‌లు వారి ఉన్నత విద్యకు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తాయని ఎస్పీ తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వివిధ విద్యా విభాగాల్లో అత్యు త్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరేసి పిల్లలు మెరిట్ స్కాలర్‌షిప్‌లు సాధించడం ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ విధంగా ఇద్దరు పిల్లలు మెరిట్ సాధించిన 9 కుటుంబాలను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందిం చారు. పిల్లల విజయాల వెనుక తల్లిదండ్రుల ప్రోత్సాహం, కృషి, త్యాగం కూడా ఎంతో కీలకమని పేర్కొంటూ,ఆ తల్లిదండ్రులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. మెరిట్ స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తు చేసే సమయంలో సాంకేతిక కారణాల వల్ల దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయలేకపోయిన అర్హులైన విద్యార్థులకు కూడా పోలీస్ వెల్ఫేర్ విభాగం ద్వారా వారి విద్యా ప్రతిభ, శాతాన్ని పరిగణనలోకి తీసుకుని తగిన సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హామీ ఇచ్చారు. కార్యక్రమం ముగింపులో మెరిట్ సాధించిన విద్యార్థులందరికీ జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. ప్రస్తుతం సాధించిన విజయాన్ని తొలి అడుగుగా భావించి, భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు. కష్టపడే తత్వం, క్రమశిక్షణ, పట్టుదల ఉంటే ఏ లక్ష్యమైనా సాధించవచ్చు. పోలీస్ కుటుంబాల పిల్లలు విద్యారంగంలో మరింత ఉన్నత విజయాలు సాధించి తమ తల్లిదండ్రులకు, పోలీస్ శాఖకు గర్వకారణంగా నిలవాలి అని జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ఐపీఎస్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవి మనోహర ఆచారి శాంతి భద్రతలు రామకృష్ణ తిరుమల శ్రీనివాసరావు సాయుధ దళం ఏవో సురేష్ కుమార్ పలువురు డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, పోలీస్ వెల్ఫేర్ విభాగం అధికారులు, సిబ్బంది, మెరిట్ సాధించిన విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# షిరిడి సాయినాధుని దర్శించుకున్న డిఎస్పి నరసింహమూర్తి

**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** గురుపౌర్ణమి సందర్భంగా శ్రీకాళహస్తిలోని చెన్నై రోడ్‌లో వెలసిన శ్రీ షిరిడి సాయినాధుని శ్రీకాళహస్తి డిఎస్పి నరసింహమూర్తి దర్శించుకున్నారు. వారికి ఆలయ నిర్వా హుకులు స్వామివారి తీర్థ ప్రసాదాలు కూడా అంద జేశారు. అనంతరం డిఎస్పీ గుడి మొత్తం ప్రదక్షిణలు చేసి పరిశీలించారు. ఆలయం చుట్టుపక్కల దొంగతనాలు ఎక్కువ జరుగుతున్నాయని, ప్రతి ఒక్కరు ఇంటిముందు, షాపులు ముందు సీసీ కెమెరాలు పెట్టుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మందిర కమిటీ సెక్రటరీ జగదీష్, లీగల్ అడ్వైజర్ రాజేశ్వరరావు, దర్గా ఉరుసు కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు, బాబా ఫరీద్ పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి షూటింగ్ పోటీలకు ఎంపికైన దువ్వూరు మనస్విని అభినందించిన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** CBSE South Zone-1 Rifle/ Pistol Shooting Championship–2026లో స్వర్ణ పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన దువ్వూరు మనస్విని ఈరోజు నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఐఏఎస్ తన కార్యాలయంలో ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, "మన జిల్లాలో ఇంతటి ప్రతిభావంతులైన క్రీడాకారులు ఉండటం ఎంతో ఆనందంగా ఉంది. మనస్వి జాతీయ స్థాయిలో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబర్చి నెల్లూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్‌కు మరింత కీర్తి తీసుకురావాలని కోరుకుంటున్నాను. జిల్లా పరిపాలన తరపున అవసరమైన సహకారం అందించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాం" అని తెలిపారు. తిరుచ్చి (తమిళనాడు)లోని Tiruchy Rifle Clubలో జూలై 23, 24 తేదీల్లో నిర్వహించిన CBSE South Zone-1 Rifle/Pistol Shooting Championship–2026లో అండర్–14 బాలికల 10 మీటర్ల పీప్ సైట్ రైఫిల్ టీమ్ ఈవెంట్లో దువ్వూరు మనస్వి స్వర్ణ పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఈ సందర్భంగా మనస్వి తాత దువ్వూరు వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ, తన మనవరాలు సాధించిన విజయంపై హర్షం వ్యక్తం చేస్తూ, జాతీయ స్థాయిలో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా, రాష్ట్రానికి మరింత పేరు ప్రఖ్యాతలు తీసుకు రావాలని ఆకాంక్షించారు. అలాగే ఆమె తండ్రి దువ్వూరు సాయి కృష్ణారెడ్డి, FSA అకాడమీ కోచ్ మనోహర్ మనస్విని అభినందించారు. కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా దుగరాజుపట్నంకు చెందిన చింతలశిరి సాయి, దేవి ఫీడ్స్ రీజినల్ మేనేజర్ హరి కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రముఖులు, క్రీడా ప్రేమికులు మనస్వికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, జాతీయ స్థాయిలోనూ విజయం సాధించి జిల్లా, రాష్ట్రానికి మరింత గౌరవం తీసుకు రావాలని ఆకాంక్షించారు.

# విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి







**చీమకుర్తి, (రాజధాని వార్తలు):** విద్యార్థులు విద్యతో పాటు క్రీడలలో కూడా రాణించాలని, చీమకుర్తి లైన్స్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ విజయ్ కుమార్ కోరారు. పట్టణములోని ఎస్‌కేఆర్ బదిరుల ఆశ్రమ పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు చీమకుర్తి లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పాఠ్య పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేసారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంకు క్లబ్ అధ్యక్షులు విజయ్ కుమార్ అధ్యక్షత వహించగా ప్రముఖ వైద్యులు డాక్టర్ జవహర్ ముఖ్య అతితిగా పాల్గొన్నారు. బధిర విద్యార్థులకు పుస్తకాలు పంపిణీకి సహకరించిన డాక్టర్ జవహర్ కృష్ణ రెడ్డి, రియా రెడ్డి, తదితరులను ప్రముఖులు అభినందించారు. లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇలాంటి సేవా కార్యక్రమంలను మరెన్నో చేపట్టాలని విద్యార్థులు కష్టపడి చదవడంతో పాటు ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలని డాక్టర్ విజయ్ కోరారు. పుస్తకాలు అందించిన జవహర్




రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అది రోహించాలని కోరారు. విద్యతో పాటు, క్రీడా రంగములో రానించాలని కోరారుపాఠశాల కరెస్పాండంట్ ఎస్.అంజి రెడ్డి మాట్లాడుతూ లైన్స్ క్లబ్ ఇలాంటి సేవా కార్యక్రమంలను మరెన్నో చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాడపాకుల రాజా, చంద్ర శేఖర్ రెడ్డి, చలువది రమేష్, రత్నయ్య, తదితరులతో పాటు విద్యార్థులు, తల్లి తండ్రులు పాల్గొన్నారు.

# సూపర్ సిక్స్ సూపర్ హిట్

## - అభివృద్ధి, సంక్షేమంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పరుగులు





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నేడు నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 21వ డివిజన్ ఉమారెడ్డిగుంటలో రెండేళ్ల నమ్మకం అభివృద్ధి – సంక్షేమం ఇంటింటి ప్రచార" కార్యక్రమంలో పాల్గొని రెండేళ్లలో చేసిన అభివృద్ధిని మరియు సంక్షేమాన్ని ప్రజలకు వివరించిన రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. రెండేళ్లలో ఏమి చేశామో ప్రజల దగ్గరకు వెళ్లి గర్వంగా చెప్పగలుగుతున్నాము. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. ప్రజలకు ఎప్పుడు ఏ అవసరం ఉన్నా నేరుగా నాకు ఫోన్ చెయ్యండి. మీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి.

రాబోయే 3 సంవత్సరాలలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తాను. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. పై కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జి కంటే సాయిబాబా, కో క్లస్టర్ ఇంచార్జి కోటిరెడ్డి, డివిజన్ అధ్యక్షులు చాంద్ బాషా, టీడీపీ నాయకులు మరియు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# కొమారి గోవిందమ్మ మృతి తీరని లోటు

## - తీర ప్రాంత సామాజిక వేత్త ప్రళయ కావేరి వేణు



**విడవలూరు, (రాజధాని వార్తలు):** సాగర తీరములో జన్మించి, ప్రళయ కావేరి బిడ్డ అయిన గోవిందమ్మ కొమారి కోడలుగా బుసగాడిపాలెం గ్రామంలో నివసిస్తున్న గోవిందమ్మ అకాల మృతి తీరని లోటుగా ఉందని తీర ప్రాంత సామాజికవేత్త ప్రళయ కావేరి వేణుగోపాల్ ఆవేదన వ్యక్తం చేసారు. వేణుగోపాల్‌కు మేనత్త అవుతోంది. బాల్య దశ నుండి మేనత్త వద్దనే ఎదిగిన వేణు మనస్తాపానికి గురి అయి ఆమె మృతి పట్ల విచారం వ్యక్తం చేసి ఆమె పార్దివదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అదేవిదంగా తీర ప్రాంతంలోని బందువులు, పెద్దలు కొందరు. మహిళలు ఆమె మృతికి సంతాపం వ్యక్తం చేసారు. గోవిందమ్మ భర్త కొమారి చినవెంకయ్య కొన్ని సంవత్సరంలు క్రితం మృతి చెందారు. చిన వెంకయ్యకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పలు రంగాల్లో స్థిరపడ్డారు. ఆనాడు చిన వెంకయ్య గోవిందమ్మలు బిడ్డలను ఉన్నత చదువులు చదివించినందున కుమారులు ఉద్యోగంలో స్థిరపడ్డారు. తీర ప్రాంతములో ఒక గుర్తింపు ఉన్న కుటుంబంగా చెప్పవచ్చు. ఇప్పుడు ఈ కుటుంబం యజమానులు ఇరువురు లేనందున తీరని లోటుగా భావిస్తున్నారు.

# కోవూరు ఎన్ఎస్ఆర్ కాలనీలో కార్డన్ సెర్చ్



**కోవూరు, (రాజధాని వార్తలు):** కోవూరు పట్టణంలోని ఎన్‌ఎస్‌ఆర్ కాలనీలో కోవూరు పోలీసులు బుధవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలాంటి చెల్లుబాటు అయ్యే పత్రాలు లేని 14 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కోవూరు సీఐ సుధాకర్ రెడ్డి, పర్యవేక్షణలో, ఎస్సై కె. ముత్యాలరావు పోలీసు సిబ్బంది ఇంటింటా తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై ఆరా తీస్తూ వాహనాల రిజిస్ట్రేషన్, బీమా, డ్రైవింగ్ లైసెన్స్ తదితర పత్రాలను పరిశీలించారు. తనిఖీల్లో సరైన పత్రాలు లేని 14 బైకులను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ప్రజలు వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. అలాగే ప్రజలు అనుమానాస్పద వ్యక్తులు లేదా కదలికలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోవూరు పోలీస్‌లు వాహనం దారులు ఉన్నారు.

# ప్రైవేట్ ట్రాన్స్పోర్ట్ బస్సుల ఆగడాలను అడ్డుకోండి : బిజెపి నేత ముక్కు రాధాకృష్ణ గౌడ్




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ప్రవేట్ బస్సు ఆగడాలను అరికట్టాలని భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు ముక్కు. రాధాకృష్ణ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా నెల్లూరు జిల్లా డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించడం జరిగినది. అనంతరం ఆయన మాట్లాడుతూ నెల్లూరు నగరంలో ప్రధాన రహదారి అయిన మినీ బైపాస్ రోడ్డు నందు నిత్యం వేలాది వాహనాలతో ట్రాఫిక్ రద్దీగా ఉంటుందని అలాంటిది సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు వందలాదిగా తమ ఇష్టారాజ్యంగా నడిరోడ్డు పైన నిలిపి ప్రయాణికులను ఎక్కించుకోవడమే కాకుండా అనేక రకాల లగేజీలను బస్సుల మీదకు వేసుకుంటూ నగర ప్రజలకు నరకాన్ని చూపిస్తున్నారని అలాగే ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులలో ఇతర రాష్ట్రాల నుంచి మరియు విదేశీ మద్యం, గంజాయి ఇతర మత్తు పదార్థాలు నెల్లూరుకి దిగుమతి అవుతున్నాయని వీటిపై ఎక్సైజ్ పోలీసు రవాణా శాఖ అధికారులు నిత్యం తనిఖీలు నిర్వహించి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రైవేట్ ట్రావెల్ బస్సులను నగరం వెలుపల ఔట్ కాట్స్ లో స్థలాన్ని కేటాయించి ప్రయాణికులకు బస్సు యాజమాన్యాలకు ఇబ్బందులేకుండా తగు చర్యలు తీసుకోవాలని అలాగే ట్రావెల్స్ బస్సులు అన్ని సరైన ఫిట్నెస్ ఉన్నదా లేదా అన్న విషయాన్ని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని శిక్షణ పొందిన డ్రైవర్లను ఇతర వర్కర్లను నియమించుకోవాలని సిబ్బందికి ప్రయాణికులకు సరైన వసతులు కల్పించాలని కోరారు. అలాగే జిల్లా నుండి ఇతర జిల్లాలకు ఇతర రాష్ట్రాలకు నిత్యం ప్రయాణించే అన్ని ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలకు తగు సూచనలు ఇవ్వాలని నెల్లూరు జిల్లాలో వందలాదిగా ఉన్న విద్యాసంస్థలకు చెందిన వేలాదిగా ఉన్న బస్సులు వ్యానులు ద్వారా విద్యార్థులను విద్యాసంస్థలకు విద్యార్థుల ఇళ్లకు చేరవేయడం జరుగుతుందని అక్కడ కూడా సరైన శిక్షణ పొందిన డ్రైవర్లు హెల్పర్లు ఇతర సిబ్బంది లేని కారణంగా వాహనాలకు సరైన ప్రమాణాలు పాటించను కారణంగా నిత్యం ప్రమాదాలు జరగడం అనేకమంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోవడం జరుగుతా ఉందని ఈ నష్ట నివారణ కోసం సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని వీటికి అడ్డుకట్ట వేయాలని జిల్లా ప్రజలకు సరైన రవాణా సదుక సదుపాయాలు ఏర్పాటు చేస్తూ ట్రాఫిక్ ను నియంత్రించాలని ఆయన కోరారు లేని పక్షంలో తాము పెద్ద ఎత్తున ఉద్యమానికి శ్రీకారం చుడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పవన్ తేజ గౌడ్, దయాకర్, కట్టా. సాయి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

# తుమ్మగుంటలో పొలం పిలుస్తుంది

## - రైతులు సద్వినియోగం చేసుకోండి : విడవలూరు మండలం ఏ ఓ, సి హెచ్. ఎస్ లక్ష్మి





**విడవలూరు, (రాజధాని వార్తలు):** విడవలూరు మండలంలోని దంపూరు, తుమ్మగుంట గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని ఎంఏఓ సిహెచ్ఎస్ లక్ష్మీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు పంట నమోదు యొక్క ఆవశ్యకతను తెలియజేస్తూ సాగు చేసిన ప్రతి రైతు కూడా తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని కోరడమైనది. అదే ప్రకారం రైతుసేవ కేంద్రంలో పిల్లిపెసరలు, జీలగలు అందుబాటులో ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేయడమైనది. రైతులకు పంట బీమా యొక్క ఆవశ్యకతను తెలియజేస్తూ వరి పంటకు ఒక ఎకరాకి 840/– ప్రీమియంగా ఉన్నదని, ఆగస్టు 15వ తేదీ ఆఖరి తేదీ అని తెలియజేశారు. అదే ప్రకారం వేరుశనగ పంటకు 284/– ఎకరాకు ప్రీమియం అని జూలై 31వ తేదీ ఆఖరి తేదీ అని తెలియజేశారు. ఆసక్తి కలిగిన రైతులు మీ సేవలో కానీ కామన్ సర్వీస్ సెంటర్లో గానీ పంట బీమా కొరకు నమోదు చేసుకోవచ్చని తెలియజేయడమైనది.

అదే ప్రకారం దంపూరు గ్రామంలో ఛాంపియన్ ఫార్మర్ ముప్పరాజు యశ్వంత్ పొలాన్ని కూడా పరిశీలించడం జరిగినది. ఈ కార్యక్రమంలో విఏఏ శ్రావ్య, కవిత, చద్విక, సొసైటీ సీఈవో సుధీర్, సిబ్బంది మరియు సమాధి శ్రీనివాసులు రైతులు పాల్గొన్నారు.

